

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

మార్చి 15, 2009

ఓట్ల వేటలో

కోట్ల మూటలు...కొత్త బాటలు...

హ్యాపీబర్త్‌డే

(2009 మార్చి 15 నుంచి
2009 మార్చి - 21 వరకు)

డి. సునయన
9సం॥, మార్చి-19
సంగీత-నరేందర్
ఇల్లందు-ఖమ్మం

సిహెచ్. జ్యోతి
7సం॥, మార్చి-2002
లక్ష్మి-రఘుపతి
ఆరుట్ల-రంగారెడ్డి

సాయి కుమారి
మార్చి
భాగ్యలక్ష్మి-నాగేశ్వరరావు
డోర్నకల్-వరంగల్

తేజ చంద్రమౌళి
మార్చి
వరలక్ష్మి-రమేష్
ఆరిలోవకాలనీ-విశాఖపట్నం

డి. లీలాకృష్ణ
7సం॥, మార్చి-2002
సుస్మిత-రాజేంద్రకుమార్
గుంటూరు

జె.సాత్విక్
10సం॥, మార్చి-18
వందన-బాబూరావు
ఆర్టీసీ క్రాస్‌రోడ్డు-హైదరాబాద్

జి.వెన్నెల
2సం॥, మార్చి-20
రాము-నాగవేణి
నరసరావుపేట-గుంటూరు



కె.రవికిరణ్
4సం॥, మార్చి-17
లక్ష్మి-పర్వతాలు
బిజినేపల్లి-మ॥నగర్

షేక్ ముబిన్‌పాషా
1సం॥, మార్చి-15
ఆహ్మద్‌బీ-
మహబూబ్‌పాషా
యాదగిరిగుట్ట-నల్లగొండ

జి. సంజయ్
2సం॥, మార్చి-2007
వినోద-మోహన్
భరత్‌నగర్-ఉప్పల్

షేక్ జాన్‌బాష
2సం॥, మార్చి-15
గౌసియ- మీరావలి
మార్కాపురం-ప్రకాశం

పి. శ్రీయ
1సం॥, మార్చి-17
అశ్వని-మల్లికార్జున్
ఆదోని-కర్నూల్

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి
ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగం పల్లి,
హైదరాబాద్-500 020

కథా నిలయం

మనలో మాట

అమ్మో అమెరికా!

ఇదివరలో అమెరికా అంటే అబ్బో ఎంత మోజు, క్రేజు. అసలా దేశం పేరు తల్చుకుంటే చాలు రంగుల ప్రపంచం కళ్లెదుట కదలాడేదికదా! డాలర్ డ్రీమ్స్ పండాలంటే ఎలాగోలా అమెరికా విమానం ఎక్కాల్సిందేననుకునేవాళ్లు. ఒకవేళ మనకు అంత సీన్ లేదనుకోండి! కనీసం అక్కడ చదువుకోవడానికి సీటొచ్చినా చాలు జన్మ ధన్యమైపోతుందనుకునేవారు. అదే అమెరికాలో ఉద్యోగం వస్తే... రొట్టె విరిగి నేతిలో పడినట్టే పొంగిపోయేవారు. ఇంక అమెరికాలో స్థిరపడిన అబ్బాయి అల్లుడిగా వస్తేనా! మామగారికి సొసైటీలో హోదా పెరిగిపోయేది. కొత్తరకం గౌరవం లభించేది. 'ఆయనకేం! అమెరికా అల్లుణ్ణి సంపాదించాడు' అనేవారు. ఇహ చుట్టాలు...పక్కాలు...స్నేహితులు కలిశారూ అంటే...అమెరికా అల్లుడు, కూతురు, వారి సంతానం గురించిన కబుర్లతో ఊపిరి సలిపేదికాదు. ఇప్పుడో...! సీన్ రివర్స్ అయింది. 'అమ్మో.. అమెరికానా...?!' అనే స్థితి. ఖర్మగాలి పిల్లలెవరైనా అక్కడ చదువుతుంటే...అమ్మానాన్నల గుండె స్థల మార్పిడి జరిగి అరిచేతిలోకి వచ్చేస్తోంది. క్షణాలు యుగాల్లా నెట్టుకొస్తున్న పరిస్థితి. ఇదివరకు అమెరికా సంబంధమనగానే సంతోషంతో ఎగిరిగంతేసే సీను మారిపోయి...'ఆ...ఏం సంబంధం లేద్దూ! అనకాపల్లి అబ్బాయైనా పర్వాలేదు...ఇక్కడే చూడండి' అనేస్తున్నారు నీరసంగా. ఉద్యోగాలకోసం అక్కడికి ఎగబడి వెళ్లినవారు పెట్టేబేడా సర్దుకుని స్వదేశం చేరుతున్నారు కాళ్లీడ్చుకుంటూ.

మన సంగతి సరే! మరి అమెరికన్లు ఎలా వున్నారూ? అంటే... రొట్టెముక్కల కోసం ఫుడ్డు సెంటర్ల ముందర క్యూలు కడుతున్నారు. 'అన్నమో ఒబామా!' అంటూ బావురుమంటున్నారు. అపరస్వర్గంగా భావించిన అమెరికాలో సింపుల్‌గా కోటిమంది ఉద్యోగాల కోసం తనువంతా కనులు చేసుకొని ఎదురుచూస్తున్నారు. ఇది వరలో ఇళ్లు కట్టుకోడానికి పిల్చి మరీ అప్పులిచ్చిన బ్యాంకులు ఇప్పుడు వాటిని వసూలు చేసే పనిలో బిజీ బిజీ. అప్పు తీర్చలేనివాడిని మెడబట్టి మరీ ఇంట్లోంచి బయటికి గెంటేస్తున్నారు. కనీసం ఇల్లు అమ్మైనా సరే అప్పు తీరుద్దామా అంటే... కొనేవారు కరవైతిరి. "కారు చౌక బాబూ! ఇల్లు ఒకటి కొంటే మరొకటి ఫ్రీ. రండి బాబూ రండి. ఆలసించిన ఆశాభంగం" అంటూ మైకులు పెట్టి అరిచినా తొంగి చూసే దిక్కు లేదు. ఫ్చ్...కొందరైతే అద్దె కట్టలేక ఏకంగా ఇళ్లే ఖాళీ చేస్తున్నారు. దీపాలు వెలిగించే దిక్కులేని ఇళ్లెన్నో. సొంత ఇళ్లల్లో వున్నా...అలాంటి పాడుబడ్డ కొంపల మధ్య బిక్కుబిక్కుమంటూ వుండలేక నానా తంటాలు పడుతున్నారు. మరి ఖాళీ చేసిన వారెక్కడవుంటున్నారూ అని దీర్ఘం తీసి అడిగితే షేరింగ్ ఇళ్లల్లో (అదీ దిక్కులేకపోతే వీధుల్లో!). అంటే కొంతమంది కలిసి ఒక ఇంట్లో పొద్దుపుచ్చుతున్నారన్నమాట. అలాగైనా ఖర్చు తగ్గించుకోవచ్చని చిన్న ఆశ. ఇదివరలో అయితే ఏదైనా ఉద్యోగం రాగానే పిల్లలు రెక్కలు వచ్చిన పక్షుల్లా ఎగిరిపోయి వేరు కుంపటి పెట్టేవారు. ఇప్పుడంత సీన్ లేదు. గతంలో కుటుంబసభ్యులందరికి కార్లు వుండేవి వాకిట్లో. ఇప్పుడో...! పెట్రోలు పోయించడానికి పైసల్లేవ్. అమ్ముదామంటే కొనే నాథుడు లేని కార్లెన్నో!

ఒబామా ఎన్నిక కాగానే అంతా సర్దుకొంటుందని ఆశించిన వారికి మాత్రం ఆశాభంగమే ఎదురైంది మరి!!

★

ఈ సంచికలో....

టపా	...	2
తెల్సా	...	3
కవిత్వమ్	...	9
మంచి పుస్తకం	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
కార్టూన్లు	...	19
విజ్ఞాన వీచిక	...	23
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...


కూల్ కూల్‌గా... 4

నోరూరించే పుచ్చ

కథ ...6

శ్రమైక జీవన సౌందర్యం

సినిమా కబుర్లు ... 18

ఎన్నికల బరిలో
బాలీవుడ్ తారలు


తెలుసుకుందామా.. 20

అద్భుతం... అద్వితీయం



ధ్రువతార కొడవటిగంటి

మార్చి 1వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన మంచి పుస్తకం చదివాం. కొ.కు ను కేతు విశ్వనాథరెడ్డిగారు ప్రశంసించిన తీరు చాలా బాగుంది. అందులో శ్రీశ్రీ ఒక మాట అన్నారు. అది నాకెంతో నచ్చింది. విశ్వసాహిత్యంలో చెహోవ్ ఒక్కడే అన్నాడు. జీవిత సత్యాన్ని అవగాహన చేసుకోవడమే వాస్తవికత. ఆయన రచనల్లో ప్రాణప్రదమైన అంతఃసూత్రమిదే. తెలుగునాట ప్రగతిశీల మేధావిగా, మహారచయితగా, సాహిత్యోద్యమశీలిగా తెలుగువాళ్ల ఆధునిక సంస్కృతీ పురోగమనానికి జీవిత పర్యంతం కృషి చేసిన మహనీయుడు కొడవటిగంటి. భూస్వామ్య సంస్కారాన్నేగాక, ధనస్వామ్య సంస్కారాన్ని గూడా అధిగమించి వెళ్లే ఘర్షణ స్పృహను ఈయన నవలల్లోని పాత్రలు కలుగజేస్తాయి. అటువంటి అత్యుత్తమ నవలా రచయితగా ఆయనకు చక్కటి పేరుంది. ఈయన రచనలను ఎన్నో చదివి విప్లవోద్యమ సిద్ధాంతానికి కట్టుబడి వారి ఆశయ అడుగుజాడల్లో నడిచేవారెందరో! అటువంటి వారిలో నేనూ ఒకడిని.

డాక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వర్లు,
చందలూరు.

ఏం అడ్మిషన్లు! ఏం అగచాట్లు !!

ఈ వారం చూద్దామా శీర్షికలో 'శిథిల సౌధాలు చెప్పే ఊసులెన్నో' అంటూ హంపి గురించి, విజయ నగర రాజ్యం గురించి, అక్కడి శిల్ప సౌందర్యం గురించీ ఇచ్చిన వివరణ బావుంది. అట్టమీది కథ అడ్మిషన్లు... అగచాట్లు చాలా బాగుంది. ప్రస్తుతం అన్ని ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్లు ప్రారంభమయ్యే సమయమిదే. ఎల్‌కేజీలో అడ్మిషన్ దొరకాలంటే పిల్లల కన్నా వారి తల్లిదండ్రులే ఎక్కువ చదవాల్సిన పరిస్థితి నేడు మనం చూస్తున్నాం. ఇక ఫీజుల విషయానికొస్తే వాళ్లు చదివేది కేజీనా, పీజీనా అనేట్టుగా ఉంటోంది. అంతంత ఫీజులు కట్టినా అబ్బే చదువు ఎంతనేది మాత్రం డౌటే. అట్టమీది కథ శీర్షికలో అడ్మిషన్లకు సంబంధించిన వివరాలు, తల్లిదండ్రుల కష్టాలు చక్కగా వివరించారు.

- జ్యోతి, విజయనగరం.

చక్కటి కబుర్లు

ఈ వారం సినిమా కబుర్లలో నిర్మలమ్మ స్వగతమంటూ ఆవిడ గురించిన కబుర్లు చెప్పారు. నిర్మలమ్మగారు చెప్పిన ముచ్చట్లు, ఆ యాస చాలా బాగున్నాయి. ఆవిడ ఎలా సిన్మాల్లోకి వచ్చారో, హీరోయిన్ ఛాన్స్ ఎలా పోయిందో చక్కగా వివరించారు. 'ఆఖరి ఆకు' కథ బాగుంది. అట్టమీది కథలో ప్రస్తుతం స్కూళ్లలోని పరిస్థితిని, వాటి తీరు తెన్నులను చక్కగా వివరించారు. అలాగే విజ్ఞాన వీచిక చదివి మాకు తెలియని ఎన్నో కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటున్నాము.

- నవ్య, ఉండవల్లి.

ఎంత ఘాటు

ప్రేమయో!

"ఒక బైకు, ఒక చెట్టు, ప్రేమ కథ" భలే వుంది. ఈ సంఘటన 1985లో జరిగినా సరే. ఇప్పటిదాకా ఉందంటే చాలా విచిత్రంగా ఉంది. వేసవి కాలంలో వచ్చే వ్యాధుల నివారణకు ఆరోగ్యం శీర్షికలో చక్కటి సూచనలిచ్చారు. వేసవి కాలంలో వచ్చే చెవి, ముక్కు, గొంతు వ్యాధుల గురించి మాకు చాలా విషయాలు తెలిశాయి. చూద్దామా పేజీలో మొత్తం శిథిలాలు చూపించేశారు. ఆనాటి కళలకు పెన్నిధి హంపి అని వివరించారు. 'చివరి ఆకు' కథలో తనని ఆకుతో పోల్చుకున్న జాన్సీని బ్రతికించడం కోసం బెహర్మన్ చేసిన త్యాగం మర్చిపోలేనిది. మన సినీ రంగానికి చెందిన అమ్మ, అమ్మమ్మ అయిన నిర్మలమ్మ మరణించడం చాలా బాధాకరం. ఆ నిర్మలమ్మను మళ్లీ పుట్టించారు స్నేహ ఆదివారం అనుబంధం వారు.

- రాజుపాలెం విజయ్ చంద్రకాంత్, గుంటూరు.

బజ్జీలు బాగున్నాయి

ఈ వారం సంచిక అట్టమీది కథ 'అడ్మిషన్లు... అగచాట్లు' లో అల్లరి పిడుగులను కొత్తగా స్కూల్లో జాయిన్ చేస్తే వారికి పాఠాలు చెప్పే టీచర్లకి కాలక్షేపంగా ఉంటుంది. ఉదాహరణకు క్షమశిక్షణ, తెలివితేటలు నేర్చుకోవడమే చిన్నారుల లక్ష్యం. పిల్లల్ని కాన్వెంటులో చేర్పించడమంటే మాటలా? అడ్మిషన్లు దొరకటం చాలా కష్టం. తల్లిదండ్రులు నానా ఇబ్బందులు పడాల్సిందే. సినిమా కబుర్లలో అమ్మలగన్న అమ్మ నిర్మలమ్మ చెప్పిన కబుర్లు ఆమె మనసుకు అద్దం పట్టాయి. చాలా సినిమాల్లో నటించి, అమ్మగా, బామ్మగా అభిమానుల్లో పేరు సంపాదించుకున్న



మంచి మనిషి. అంత మంచి మనిషి ఇకలేరు అని తెలిసిన తరువాత ఏదో పోగొట్టుకున్న బాధ కలిగింది మాకు. ఎన్నో చిత్రాల్లో నటించి అభిమానులకు దగ్గరైన నిర్మలమ్మ గారి జీవిత గాథ తెలియజేశారు. తెలుసుకుందామాలో విజయనగర సామ్రాజ్య పరిపాలన చేసిన శ్రీకృష్ణ దేవరాయల వారి చరిత్ర గురించి అనేక విషయాలు తెలియజేశారు. తెల్సా ద్వారా ప్రమాదకరమైన చేప గురించి చదివిన తర్వాత మనుష్యుల ప్రాణాలు తీసే చేపలు కూడా వుంటాయా అన్న ఆశ్చర్యం కలిగింది. పి. జ్యోతి గారు బీరకాయ బజ్జీల తయారీ గురించి వివరించారు. చాలా బాగున్నాయి. వారికి మా ధన్యవాదాలు. పదమూడేళ్ల బాలుడు ఒక పసికందుకు తండ్రి అంటే విడ్డూరంగా ఉంది. బ్రహ్మం గారు చెప్పినట్లు ఇలాంటి విచిత్రాలెన్ని చూస్తామో మరి. అలాగే బీరు బాటిళ్లతో ఆలయం గమ్మత్తుగా ఉంది. ఇలాంటివెన్నో అందిస్తున్న స్నేహకు మా కుటుంబ సభ్యులందరి తరపున అభినందనలు.

అనుపోజు సంతోషి నాగరాజు,
రాజీవ్ కాలనీ, విజయనగరం.

మీ రచనలను, ఉత్తరాలను పంపవలసిన చిరునామా...

ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం

మోటూరు హనుమంతరావు భవన్, 21/1,

అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా,

హైదరాబాద్.

వీరి వీరి గుమ్మడి పండు

వీరి పేరేమి?

ఈ ఫోటో ఓ ప్రముఖ రాజకీయ నాయకుడిది. ఎవరో తెలియాలంటే 23 వ పేజీ చూడండి.

తెలుసా!



దాగుడుమూతలాడే దీవులు

సముద్రనీటిమట్టం పెరిగి చిన్న చిన్న దీవులు కనిపించకుండా పోవడం మనకు తెలిసిందే. అయితే తరచూ కనిపించకుండా పోయి, తిరిగి పైకి తేలే దీవుల్లో ఆస్ట్రేలియా సమీపంలోని ఫాల్కన్ ద్వీపాన్ని ప్రథమంగా చెప్పుకోవచ్చు ఈ దీవి 1913లో పూర్తిగా నీటి అడుగుకు వెళ్ళిపోయింది. పదమూడేళ్ల అనంతరం తిరిగి 1926లో నీటిపైన తేలింది. 23 ఏళ్లపాటు నీటిపైన వున్న ఈ ద్వీపం తిరిగి 1949లో నీటి అడుగుకు వెళ్లిపోయింది. కాగా ప్రతి సంవత్సరం అక్టోబర్ నెలలో నీటి అడుగుకు వెళ్ళిపోయి వసంత రుతువులో తిరిగి బైటపడే దీవీ ఒకటుంది. లివోనిస్‌లోని లైఫంజర్ సరస్సులోగల ఒక చిన్న ద్వీపం ప్రతి ఏటా అక్టోబర్‌లో నీటి అడుగుకు వెళ్ళిపోతుంది. వసంతరుతువు రాగానే బైటపడే ఈ దీవిపై రైతులు పశు గ్రాసాన్ని పెంచి, కోసి ఎండబెడుతుంటారు.

పొడవాటి నిర్మాణం



పక్కన ఎటువంటి ఆధారమూ లేని, ప్రపచంలోనే అతి పొడవైన నిర్మాణంగా కెనడా జాతీయ స్థూపం గుర్తింపు పొందింది. సి.ఎన్ టవర్‌గా పిలువబడే ఈ స్థూపం కెనడాలో టొరెంటోలో 1976 లో నిర్మించారు సూది మొన వలె నిర్మించబడిన ఈ నిర్మాణం 533 మీటర్ల పొడవున వుంది. ఈ నిర్మాణమే రికార్డుగా నమోదైతే దాని పైన ఏడంతస్తులుగా నిర్మించిన మరో నిర్మాణం కూడా వేరే రికార్డుగా నమోదైంది. అందులో చుట్టుపక్కల దేశాలు వీక్షించేందుకు అనువుగా నిర్మించడమే కాక మరో రెండు గదులు కూడా నిర్మించారు. వాటిలో ఒకటి సమాచార ప్రసార సామగ్రితో వుండగా మరో గదిలో రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు. ప్రపంచంలో అతి ఎత్తైన ప్రదేశంలో వున్న అతి పెద్ద రెస్టారెంట్‌గా ఇది రికార్డుల్లో నమోదైంది. ఈ నిర్మాణం పైన శక్తివంతమైన రేడియో, టీవీ యాంటిన్నాను అమర్చారు. కెనడా జాతీయ రైల్వే శాఖ ఆ ప్రాంతంలో టీవీ ప్రసారాలను మెరుగు పరిచేందుకు ఈ కట్టడాన్ని నిర్మించింది. ఇది పూర్తయ్యేందుకు 40 నెలలు పట్టింది.

ప్రాచీన రోమ్‌లో ప్రాణాంతక క్రీడ

ప్రాచీన రోమ్‌లో కత్తియుద్ధం ప్రముఖమైన క్రీడగా ఉండేది. ఇరు వ్యక్తుల మధ్య ఎవరో ఒకరు మృతి చెందే వరకు సాగే ఈ క్రీడను ఆనాడు పరమానందంతో వీక్షించే వారు. ఈక్రీడను కాన్ స్టాంటెన్ చక్రవర్తి క్రీ.శ. 326లో నిషేధించాడు. అయితే ఈ నిషేధం క్రీ.శ.404 వరకూ అమలులోకి రాలేదు. ఆ సంవత్సరం ఇరువురు వ్యక్తుల మధ్య భీకరమైన పోరు జరుగుతుండగా, టెలిమాచస్ అనే సన్యాసి ధైర్యంగా వారి మధ్యకు జొరబడి అతిప్రమాదకరమైన ఆ ఆటను నిలుపు చేసేందుకు ప్రయత్నించాడు. అంతవరకూ ఎంతో ఆసక్తిగా పోటీని తిలకిస్తున్న ప్రేక్షకులకు అది నచ్చలేదు. ఆ సన్యాసిని వాళ్ళు రాళ్ళతో కొట్టి పోటీ జరుగుతున్న ప్రదేశంలోనే చంపివేశారు. కానీ ప్రాణాంతకమైన ఈ క్రీడ జరిగే గోదాలో మృతి చెందిన ఆఖరు వ్యక్తిగా ఆ సన్యాసి మిగిలిపోయాడు. అది మొదలు రోమ్‌లో కత్తియుద్ధ క్రీడలు నిర్వహించలేదు.

చేతి రుమాళ్లపై వార్తలు

1875 ప్రాంతంలో ఆస్ట్రేలియాలో చేతి రుమాళ్ళపై వార్తలు ప్రచురించబడ్డాయి. అప్పట్లో ఆస్ట్రేలియాలో క్వీన్స్‌లాండ్‌లో కాగితం కొరత ఏర్పడింది. 'ఎడ్రడ్జ్ కొరియర్' అనే పత్రిక మూత పడే స్థితికి వచ్చింది. అయితే ఆ పత్రిక సంపాదకునికి చేతి రుమాళ్ళపై వార్తలు ప్రచురించాలన్న ఆలోచన వచ్చి వెంటనే ఆచరణలో పెట్టాడు. కొద్దికాలమే అయినా ఆ ప్రక్రియను పాఠకులు బాగానే ఆదరించారట.



★

కూల్‌కూల్‌గా...



నోరూరించే పుచ్చ

అదో కాయ.
సైజు కూడా పెద్దదే.
చూడ్డానికి పైకి ఆకుపచ్చగా వున్నా...
కోస్తే మాత్రం ఎర్రగా వుంటుంది.
చూస్తుంటేనే నోరూరుతుంది.
ఇక తింటేనా! కమ్మగా వుంటుంది.
...ఇంతకీ ఏంటబ్బా ఇది?!
య్యస్... పుచ్చకాయ.
అచ్చంగా మన కోసమే...
అంటే భారతీయుల కోసమే
ప్రకృతి ప్రసాదించిన వరంలా వుంటుంది
చూడ్డానికి.
వేసవిలో కూల్ కూల్‌గా వుంటుందని...
పుచ్చకాయ కబుర్లతో వచ్చాం.

- కె.చరిత

ప్రకృతి భలే విచిత్రమైనది సుమా! ఓవైపు ఎర్రటి ఎండలతో పొగలు సెగలు కక్కేలా చేస్తుంది. మరోవైపు ఆ వేసవి తాపాన్నుంచి బయటపడడానికి చల్లచల్లటి పుచ్చకాయలనిస్తుంది. ఇది దాహాన్ని తీరుస్తుంది. పైగా శరీరానికి ఉపయోగపడే పోషక పదార్థాలు ఎన్నో. విచిత్రం కాక మరేంటి! చూస్తుంటేనే నోరూరే పుచ్చకాయ కబుర్లు ఎన్నో. అన్నీ ఒక్కసారే చెప్పుకోడానికి కుదరకపోయినా ఏవో కొన్ని చెప్పుకుందాం.

ఎక్కడ పుట్టిందబ్బా...

అసలు పుచ్చకాయ ఎక్కడ పుట్టి వుంటుంది? అని ఎప్పుడో ఒకసారి అనిపించే వుంటుంది. ఎర్రటి ఎండలు...కాలు పెడితే బొబ్బలెక్కే ఇసుక... పిడచకట్టుకుపోయే నోరు...కనుచూపుమేర కనిపించని నీరు...అలాంటి కల్హారి ఎడారిలో నోరూరించే పుచ్చకాయ పుట్టిందంటే నమ్ముతారా! అయితే మొదట దాన్ని ఎక్కడ సాగు చేశారనే దానిపై భిన్నాభిప్రాయాలున్నాయి. నైలు నది ఒడ్డున క్రీస్తు పుట్టక మునుపే ఎప్పుడో పండించారని అంటారు. అయితే ఫారో రాజు సమాధిలో పుచ్చకాయ విత్తనాలు లభించాయంటారు. చైనాలో మాత్రం క్రీస్తుశకం పదవ శతాబ్దం నుంచి పుచ్చకాయలను పండిస్తున్నారు. ప్రపంచంలోకెల్లా అత్యంత ఎక్కువగా పుచ్చకాయలను పండిస్తున్న దేశం కూడా అదే కావడం ఆశ్చర్యమేమీ కాదుకదా. 13వ శతాబ్దం నాటికి మెల్లగా యూరప్ ఖండం చేరింది. అయితే చైనా కంటే ముందే వియత్నాం చేరిందని కూడా అంటారు. 1500 సంవత్సరం ప్రాంతంలో మిస్సిసిపి లోయలో స్థానిక అమెరికన్లు, తొలి ఫ్రెంచ్ పరిశోధకులు పుచ్చకాయను పండించారు. 1629 నాటికి మసాచుసెట్స్ చేరింది. అలా అలా మొత్తం మీద పుచ్చకాయ ప్రపంచ జనులందరికీ పరిచయమైంది.

రకరకాల ఆకృతుల్లో ...

మనకు తెల్సిన పుచ్చకాయ కోడిగుడ్డు ఆకారంలోనో, గుండ్రంగానో వుంటుంది. దీన్ని ఫ్రిజ్జులో పెట్టడం కొంచెం కష్టమే. దొర్లుతుంటుందికదా. అయితే కొందరు రైతులు తెలివితేటలు ఉపయోగించి రకరకాల ఆకారాల్లో పుచ్చకాయలను పండించసాగారు. జపాన్ రైతులు చతురస్రాకారపు పుచ్చకాయలు పండిస్తున్నారు. వాటి గిరాకీ, ధర కూడా ఎక్కువేలెండి. ఇందులో ఒక సౌలభ్యం వుంది. వీటిని ఫ్రిజ్జుల్లో పెట్టుకోవడానికి సౌలభ్యంగా వుంటుంది. ఇదే కాక త్రిభుజాకారపు, హృదయాకారపు, మనిషి తల ఆకారపు పుచ్చకాయలను కూడా రూపొందిస్తున్నారు. పుచ్చకాయ పిందెగా వున్నప్పుడే దాన్ని కాడతో సహా చెక్క పెట్టెలోకో, గాజు పెట్టెలోకో పంపిస్తారు. అది పెరిగి పెద్దదయ్యేకొద్దీ సదరు ఆకారాన్ని సంతరించుకుంటుంది.

విత్తనాలు లేని పుచ్చ...

మనకు పుచ్చకాయ తినేటప్పుడు మాటిమాటికీ విత్తనాలు అడ్డు వస్తుంటాయి. అదే కొంచెం చికాగ్గా వుంటుంది. అవి లేకుండా వుంటే




దాని రుచిని, చల్లదనాన్ని ఆస్వాదిస్తూ లాగించేయొచ్చుకదా అనిపిస్తుంది. అది ఆలోచించే కొందరు శాస్త్రవేత్తలు విత్తనాలు లేని పుచ్చకాయలను తయారుచేసేశారు. అయితే ఇందులోకూడా అక్కడక్కడా విత్తనాలు కనిపించినా అవి మెత్తగా వుంటాయి.

పుచ్చ విశేషాలు

♦ పుచ్చకాయ సాగు 5వేల సంవత్సరాల క్రితమే ఈజిప్టులో జరిగిందని చెప్తారు.

♦ పుచ్చకాయ పండు కాదు. కూరగాయ అంటే నమ్మకం కుదరదు కదూ. కానీ అదే నిజం. అది దోస, గుమ్మడి జాతికి చెందినది.

♦ ప్రపంచవ్యాప్తంగా 96 దేశాల్లో పుచ్చకాయను పండిస్తున్నారు.

♦ చైనా, జపాన్ దేశాలలో ఎవరికైనా బహుమతి ఇవ్వాలంటే... పుచ్చకాయనే సమర్పిస్తారు.

♦ పుచ్చ సాధారణంగా ఎరుపు రంగులో వుంటుంది. అయితే కొన్ని కొన్ని ప్రాంతాలలో నారింజరంగు, గులాబీ రంగు, పసుపు, తెలుపు రంగు పుచ్చకాయలు కూడా లభిస్తాయి. పుచ్చకాయ మొత్తం బరువులో 92 శాతం నీరుకాగా ఆరుశాతం షుగర్ వుంటుంది.

♦ ఇందులో సి, ఎ, బి6' విటమిన్లు లభిస్తాయి.

♦ పుచ్చకాయతో జామ్, జ్యూస్ చేస్తారన్న సంగతి తెల్సిందేగానీ.. . చైనాలో పుచ్చకాయను కూరగాయలాగానూ వినియోగిస్తారు.

♦ అమెరికా, రష్యా, ఉక్రెయిన్, రొమానియా, బల్గేరియాలో పుచ్చకాయతో పచ్చళ్లు పడతారు. పొద్దుతిరుగుడు విత్తనాలకు మల్లే పుచ్చ విత్తనాలను కూడా రకరకాల పద్ధతుల్లో తింటారు.

♦ 1796లో అమెరికాలో మొట్టమొదటి వంట పుస్తకాన్ని ప్రచురించారు. అందులో పుచ్చకాయకు సంబంధించిన వంటకం కూడా వుంది.

♦ ఓసారి రాజకీయ చర్చ సందర్భంగా రోమన్ గవర్నర్ మీద ఒకరు పుచ్చకాయ విసిరారు. అందుకు ఆయన ధన్యవాదాలు తెల్పుకున్నాడు. ఎందుకో తెల్సా. పుచ్చహెల్మెట్ ప్రసాదించినందుకు!

♦ పుచ్చకాయ అద్భుతమైన ఆహారం. ఇందులో ఎటువంటి కొవ్వు, కొలెస్ట్రాల్ వుండదు.

♦ ప్రపంచవ్యాప్తంగా 1200 రకాల పుచ్చకాయలను పండిస్తున్నారు.

♦ ఆఫ్రికాలో అయితే పుచ్చకాయ తొక్కను కూడా వండుకుని తింటారు. అంతేకాదు పుచ్చకాయలో దేన్నీ వృథాగా పడేయరు. ఆఖరుకు విత్తనాలను కూడా.

♦ మొట్టమొదట 'వాటర్ మెలాన్' అన్న పదం ఆంగ్ల పదకోశంలో 1615వ సంవత్సరంలో కనిపించింది.

♦ పలు దేశాల్లో పుచ్చకాయ తినే పోటీలు పెడతారు. అంటే ఎవరు ఎక్కువ తింటే వారు గెల్చినట్టన్నమాట.
పుచ్చకాయను కళాఖండాలుగా కూడా మలచుతారు. ★



కథా నిలయం
శ్రీకాకుళం

కథ

శ్రమైక జీవన సౌందర్యం

- పారుపల్లి వెంకటేశ్వరరావు

మొదట మా నాన్న మధ్య తరగతి రైతు.వ్యాపార పంటలు వేసి నష్టాలయ్యాడు. పొలం, ఇల్లు, అమ్మి అప్పులు తీర్చి అద్దె ఇంట్లో చేరి, వ్యవసాయ కూలీ అయ్యాడు. మా అమ్మ పట్టుదలతో నన్ను చదివించింది. మా అన్నలిద్దరికీ నన్ను చదివించటం ఇష్టంలేదు. నేను ఎనిమిదో తరగతిలో వుండగానే అన్నలిద్దరూ కుటుంబం నుండి విడిపోయారు. మా గురువుగారు ఆత్రేయగారు విజయవాడలో స్వంతఇల్లు నిర్మించుకొని వుంటున్నారు. ఆయన సహకారంతో నేను ప్రయివేటుగా ఇంటర్‌మీడియట్ పూర్తిచేశాను. బి.ఏ. రెండవ సంవత్సరం పరీక్షలు రాసి పాసయ్యాను. ఇక ఫైనల్ బి.ఏ. కూడా రాసే ప్రయత్నం ప్రారంభించాను. ఆ యేడే టైఫాయిడ్‌వచ్చి నాన్న మరణించాడు. అమ్మ, నాన్న ఇద్దరూ అన్యోన్యంగా వుండేవారు. నాన్న మరిణించేసరికి అమ్మ మనోవ్యాధితో కృంగి, కృశించి కొద్ది రోజుల్లోనే అంతిమశ్వాస విడిచింది. అమ్మనాన్నల మరణంతో నేను ఏకాకినయ్యాను. అన్నలిద్దరూ నా గురించి ఆలోచించే స్థితిలో లేరు. ఆ సమయంలో మా నాన్న పెదతండ్రి కొడుకు శంకరయ్య బాబాయి నా దగ్గరికి వచ్చాడు. ఆయనది విజయపురం. అప్పుడప్పుడు మాధవపురం వచ్చి మా నాన్నను పరామర్శించి పోతూ వుండేవాడు. ఆయన ఇల్లరికపు అల్లుడు. మోతుబరి రైతు. నా పనితనం, మంచితనం ఆయనకి తెలుసు. మా అన్నలకంటె నన్నే బాగా పలకరించి మాట్లాడతాడు. "ఆరె గౌతమ్! మాది పెద్ద వ్యవసాయం. నువ్వు పరాయివాళ్ల పనుల్లో వుండటమెందుకు? మాకెలాగూ మనుషులు కావాలి! నిన్ను కొడుకులాగే చూసుకుంటా! ఇతరులకంటే వంద రూపాయలు ఎక్కువ ఇస్తా! మా ఇంట్లో ఉండు" అన్నాడు.

నాకు కావాల్సింది అలాంటిపనే. అలాగే చేస్తా బాబాయ్! అని వెంటనే ఒప్పుకున్నాను. రైతు ఇంట్లో పనిచేసే జీతగాడికి అన్నం పెట్టి బట్టలు, చెప్పులు ఇచ్చి యేడాదికి రెండు వందల రూపాయలు ఇస్తారు. నాకు మా బాబాయి మూడు వందలు ఇస్తానన్నాడు. నా బట్టలు, పుస్తకాలు సంచిలో సర్దుకున్నాను. కావ్యాలు, చరిత్ర నాకున్న సాహిత్య సంపద. ఏ పనిలో వున్నా రాత్రిపూట అరగంటసేపు చదువుకుంటాను. అది గురువుగారి సలహా. శంకరయ్య బాబాయి వెనక నిశ్శబ్దంగా బయలు దేరాను.

◆ ◆ ◆

ఆ కుటుంబానికి నాలాంటివాడి అవసరం వుంది. గంగాభవాని పిన్ని కూడా నన్ను సాదరంగా ఆహ్వానించింది. దగ్గర బంధువును కనుక భోజనం వారితో పాటే చేస్తున్నాను. యేసుదాసు, జీవరత్నం అనే ఇద్దరు అరక దున్నే జీతగాళ్లున్నారు. ఇద్దరూ నన్ను గౌరవంగా చూస్తూ చక్కగా సహకరిస్తున్నారు. మూడు అరకలలో నేను ముందు అరక దున్నుతాను. బాబాయి ఇల్లే అయినా పనికి కుదిరిన తరువాత బాధ్యతగా చేయాలి. మాట అనిపించుకోగూడదు. తెల్లవారు జామున నాలుగు గంటలకే నిద్రలేచేవాడిని. రాత్రి తొమ్మిది గంటలదాకా ఆ ఇద్దరు జీతగాళ్లనీ కలుపుకొని నేర్పుగా విధులు నిర్వర్తించేవాణ్ణి! మా పిన్ని గంగాభవాని అందరినీ మెచ్చదు. ఆమె అభిమానం సంపాదించాను. ఆ దంపతులకి అమరేంద్ర, సుమతి సంతానం. వారితో అదే నాకు తొలిపరిచయం. కొడుకు మాద్రాసులో ఎం.బి.ఎ. చదువుతున్నాడు. కూతురు సుమతి గుంటూరులో బి.ఎ. చదువుతుంది. ఆ ఇంట్లో నేను చేరిన అయిదు రోజుల తరువాత ఇద్దరూ కాలేజీలకు వెళ్ళారు. ఆ యేడు వర్షాలు అనుకూలంగా పడ్డాయి. తోటి జీతగాళ్లతో కలిసి దీక్షతో కృషిచేసి, పొలాన్ని బాగా దున్ని పండులాగా చేశాను. అదును పదును అద్భుతంగా కుదిరి వేసిన పైర్లు చక్కగా మొలకెత్తి ఎదుగుతూ పచ్చదనంతో, ప్రకృతి శోభతో, కనువిందు చేస్తున్నాయి. పక్కరైతుల పొలాల్లో పైరులకన్నా మా పొలాల్లో పైరులు బాగున్నాయి. ఎవరెంత మెచ్చుకున్నా పొంగిపోకుండా, జీతగాడుగా నాస్థానాన్ని మర్చిపోకుండా ఉన్నాను. బాబాయి మాత్రం నాతో అన్ని విషయాలు చెబుతూ ఆత్మీయంగా వుంటున్నాడు.

◆ ◆ ◆

విజయదశమి పండుగ సెలవులకు అమరేంద్ర, సుమతి విజయపురం వచ్చారు. వారితో పాటు మరొక అమ్మాయి వచ్చింది. చక్కని రూపం,

మంచి రంగు ఆకర్షణీయంగా, చలాకీగా వుంది. బాబాయి ఆ అమ్మాయిని బావమరిది కూతురుగా పరిచయం చేశాడు. బంధువుగా నన్ను పరిచయం చేస్తుంటే ఆ అమ్మాయి నాకు నమస్కారం చేసింది. పేరు సుజాత అని బాబాయి చెప్పాడు. నాగరించి తెలియకపోయినా నమస్కారం చేయటం ఆ సంస్కారం వల్లనే అని మనసులో అనుకున్నాను. నాకు సుజాత నమస్కారం చేస్తుంటే అమరేంద్ర అయిష్టంగా చూడటం నేను గమనించాను. అమరేంద్ర నా వయసువాడే. అతనికి నేను బంధువుగా కాక పాలేరుగానే కనబడుతున్నానేమో! ఎవరేమనుకున్నా నిజానికి ఆ ఇంట్లో నేను జీతగాణ్ణేకదా! అప్పటిదాకా అంతగా పరిచయంలేకపోయినా సుమతి నన్ను 'అన్నయ్యా!' అని ఆత్మీయంగా పిలుస్తుంది. సుమతి అన్న పేరు సార్థకంగా వుంది అనుకున్నాను. సుమతి గుంటూరులో సుదర్శన్‌రావుగారింట్లోనే వుండి సుజాతతో కలిసి చదువుతుంది. ప్రతిరాత్రి బాబాయి నేను ఒకే సమయంలో కలిసి భోజనం చేస్తాం. ఆ ఇంట్లో ఆరుగురు కూర్చొని భోజనం చేయటానికి వీలైన డైనింగు టేబుల్ వుంది. ఆ రోజు అమరేంద్ర, సుమతి, సుజాత, పక్కపక్కనే భోజనాలకు కూర్చున్నారు. వారికి ఎదురుగా నేను, బాబాయి కూర్చున్నాం. అందరికీ పిన్ని వడ్డిస్తోంది. బాబాయి జొన్న పైరులో అంతర కృషి గురించి నన్ను అడుగుతున్నాడు. పిన్ని కూడా నేను చెప్పే విషయాలు ఆసక్తిగా ఆలకిస్తోంది. అన్నాలు తినే దగ్గర కూడా పొలాల గోలేనా? అన్నాడు అమరేంద్ర.

"అదేందిరా! అట్లంటావ్? అదేమన్నా అనవసరపు గోలా? జీవితానికి అవసరమైన

ఏ ప్రయోజనం ఆశించి బాబాయి నన్ను తన ఇంటికి తెచ్చుకున్నాడో అది నెరవేరింది. ఆ యేడు పక్కరైతుల పొలాలకంటె మా పొలాలు బాగా పండాయి. బాబాయి నా పట్ల చూపిన ఆదరణ, అభిమానాలలో కొంత బంధుప్రేమవున్నా, పిన్నిది మాత్రం ఫలితాలకు సంబంధించిన ఆదరణే! నాకు మూడు వందలు జీతం ఇచ్చారు. ఒకసారి మాధవపురం వెళ్లవస్తానన్నాను. 'అలాగే వెళ్లిరా! మళ్లీ కొత్త జీతం మాట్లాడుకుందాం!' అన్నాడు బాబాయి.

చర్చరా! అదే మన జీవనాధారం!" అన్నాడు బాబాయి.

"విజ్ఞానం, సరికొత్త టెక్నాలజీ, వ్యాపారం విస్తరిస్తున్న ఈ ఆధునిక యుగంలో పాత చింతకాయ పచ్చడి కబుర్లతో కాలక్షేపం చేస్తే బాగుపడ్డట్లే!" అన్నాడు అమరేంద్ర గొప్ప విషయం చెప్పినట్లు పోజుపెట్టి.

ఆధునిక టెక్నాలజీ అయినా, అణుశక్తి విజ్ఞానమైనా, మనిషికి మొదట కావాల్సింది అన్నమేగదా! శాస్త్రవేత్తలైనా, వ్యాపారవేత్తలైనా అన్నం తినకపోతే ఏమీ చేయలేరు, ఆలోచనలు రావు. ఆ అన్నం ఉత్పత్తి అయ్యేది కొండ్రల ద్వారానే! అన్నం తరువాతే అన్నీ" అన్నాను నేను.

"గౌతమ్ అన్నయ్యా! బాగా చెప్పావు. పంటపొలాలంటే నాకు భలే ఇష్టం!" అన్నది సుమతి.

"అన్నం తరువాతే అన్నీ' అని గౌతమ్‌గారన్నది అక్షరాలా నిజం! అన్నం కరువైన దేశంలో ఏ అభివృద్ధీ జరగదు. 'పాడిపంటలు పొంగిపొర్లే దారిలో నువ్వు పాటుపడవోయ్' అన్నాడు అమరకవి గురజాడ" అన్నది సుజాత.

"గౌతమ్! అయితే ఆధునిక టెక్నాలజీ, పారిశ్రామికాభివృద్ధి, వాణిజ్య విస్తరణ, అవసరం లేదంటావా?" అని నా వైపు చూస్తూ ప్రశ్నించాడు అమరేంద్ర.

"అవసరం లేదని నేనన్నానా? అన్నీ కావాలి! అయితే అన్నింటినీ సృష్టించే మనిషికి ముందు అన్నం కావాలిగదా" అన్నాను. అన్నానికి మూలం వ్యవసాయం! అమెరికా, రష్యా, చైనా, జపాన్ వంటి దేశాలు వ్యవసాయాభివృద్ధి ద్వారానే పారిశ్రామిక ప్రగతి సాధించాయి. వరి సాగులో జపాన్ నాటు పద్ధతి బాగుందని మనమూ అనుసరిస్తున్నాం. ఆహారోత్పత్తి పరిజ్ఞానం ముందు కావాలి! తరవాతే అణుశాస్త్ర పరిజ్ఞానామైనా, వాణిజ్య విస్తరణ అయినా" అన్నాను నేను.

అమరేంద్ర ఇంకేమీ మాట్లాడలేదు. అతడు వాదనకు దిగనందుకు నేను ఆనందించాను. ఆ ఇంట్లో నేను వుండే గదికి తాళం వుండదు. అందులో వుండేది. నా బట్టలు, పుస్తకాలే! ప్రతిరోజు రాత్రి అరగంటసేపు చదువుకొని పడుకుంటాను. ఆ రోజు రాత్రి నేను గురువుగారు ఆత్రేయగారికి ఉత్తరం రాశాను. అది పూర్తి చేయలేదు. తరువాత రాసి పోస్ట్ చేద్దామని బీరువాలో పుస్తకాలపైన పెట్టాను. ఆత్రేయగారు కూడా నాకు ఉత్తరాలు రాస్తారు. అవి కూడా బీరువాలో వున్నాయి. దానికీ తాళం వుండదు. మరునాడు నేను పొలంపని చేసి ఇంటికి వచ్చేసరికి సుమతి, సుజాత నా గదిలో పుస్తకాలు తిరగేస్తున్నారు. నన్ను చూసి సుమతి నవ్వుతూ 'అన్నయ్యా! నీ గదిలో దొంగలు పడ్డారు' అంది.

'ఎత్తుకుపోవటానికి ఈ పేదవాడి గదిలో ఏం దొరుకుతాయి సుమతీ!' అన్నాను.

'గౌతమ్‌గారూ! ధనంకంటె విలువైనవే మీ గదిలో దొరికాయి. మీరు పేదవారు కారు, జ్ఞానధనులు. మీ ధనాన్ని దొంగలు ఎత్తుకుపోలేరు. మీ గురువు ఆత్రేయగారు గొప్పవారు. మీ ఉత్తరాలు చదివినందుకు మా ఇద్దరినీ మన్నించండి!' అన్నది సుజాత చిరునవ్వుతో.

నేను గురువుగారికి రాసిన ఉత్తరంలో ఆ రాత్రి భోజనాల దగ్గర జరిగిన సంభాషణలు వున్నాయి. సుజాతని మెచ్చుకుంటూ రాసిన మాటలున్నాయి. స్వంత చెల్లెలు లేని నాకు సుమతి చెల్లెలుగా ఆ లోటు తీరుస్తుందని రాశాను. ఉత్తరం ఇద్దరూ చదివారు.

'సుజాతా! గురువు గారికి రాసిన ఉత్తరంలో మీ ఇద్దరి ప్రస్తావన వుంది. మీరు చదివారుగదా! యేమీ అనుకోకండి!' అన్నాను.

"అందులో తప్పేం రాశారు? పైగా ప్రశంసే వుంది. ఉత్తరాలు చదవటం మాదే తప్పు. మీ

చెల్లెలే ధైర్యంచేసి చదివింది. మీ గురువుగారు మీకు రాసిన ఉత్తరాలు మాకెంతో విజ్ఞానదాయకంగా వున్నాయి. మీరెంత సహృదయులో ఎంత విజ్ఞానవంతులో ఉత్తరాలు చదివితే తెలిసింది" అన్నది సుజాత.

అన్నయ్యా! ఈ రోజు నుండి నువ్వు నాకు స్వంత అన్నయ్యవే! అంది సుమతి.

◆ ◆ ◆

మీకొక విన్నపం. మాధవపురంలో రాములమ్మ అనే యాదవ మహిళ నాకు మాతృ సమానురాలు. అమ్మానాన్నల మరణానంతరం నేను దుఃఖంలో వుంటే ఆమే నన్ను కన్నతల్లిలా ఓదార్చింది. ఆ ఆదరణ నేను మర్చిపోలేను. ఆ అమ్మకి ఈ శుభవార్త చెప్పి ఆమె ఆశీస్సులు అందుకొని మీ ఇంటికి వస్తాను. అడ్రసు ఇవ్వండి!'

కాలచక్రం ముందుకు సాగిపోతూ వుంది. అమరేంద్ర ఎం.బి.ఏ. పాసయ్యాడు. సమతి, సుజాత ఇద్దరూ బి.ఎ పాసయ్యారు. ముగ్గురూ ఫస్టుక్లాసులో పాసయ్యారు. నేను బి.ఏ. ఫైనల్ రాయటం కుదరలేదని విచారించాను.

ఏ ప్రయోజనం ఆశించి బాబాయి నన్ను తన ఇంటికి తెచ్చుకున్నాడో అది నెరవేరింది. ఆ యేడు పక్క రైతుల పొలాలకంటె మా పొలాలు బాగా పండాయి. బాబాయి నా పట్ల చూపిన ఆదరణ, అభిమానాలలో కొంత బంధుప్రేమవున్నా, పిన్నిది మాత్రం ఫలితాలకు సంబంధించిన ఆదరణే! నాకు మూడు వందలు జీతం ఇచ్చారు. ఒకసారి మాధవపురం వెళ్లివస్తానన్నాను. 'అలాగే వెళ్లిరా! మళ్లీ కొత్త జీతం మాట్లాడుకుందాం!' అన్నాడు బాబాయి.

ఆ సమయంలో సుజాత తండ్రి సుదర్శన్‌రావుగారు, తల్లి సుశీలగారు, కారులో వారి ఇంటికి వచ్చారు. విజయపురంలో ఒక రైతు కుటుంబంలోని వితంతు మహిళకి సంబంధించిన ఆస్తి వివాదంలో సత్యాసత్యాలు తెలుసుకోవటానికి వచ్చామని బాబాయికి చెప్పారు. రాగానే నన్ను అభిమానంగా పలకరించారు. సుజాత నా గురించి చెప్పి వుంటుందనుకున్నాను.

ఇద్దరూ విజయపురం గ్రామ మునసబుని కలుసుకొని, వివరాలు తెలుసుకొని వచ్చారు. గుంటూరుకు తిరుగు ప్రయాణం అయ్యారు.

అప్పుడు మా పిన్ని తన అన్నతో 'అమరేంద్రకి, సుజాతకి ఈ యేడు పెళ్లి చేస్తే బాగుంటుంది. అన్నయ్యా! నువ్వేమంటావ్?' అని అడిగింది.

ఆస్తి, చదువు, చక్కదనం వున్న అమ్మాయి. అమ్మా నాన్నలకు ఒక్కతే కూతురు కనుక పిన్నికి సుజాతని కోడలుగా చేసుకోవాలన్న కోరిక బాగా వుంది. అనుకున్నాను.

'అమ్మాయీ! మేనరికాలు మాకు ఇష్టం వుండవు. ఒక వేళ సుజాతకి అమరేంద్రని చేసుకోవటం ఇష్టం అయితే నాకేం అభ్యంతరం లేదు. దాని ఇష్టమే మా ఇష్టం!' అన్నాడు సుదర్శన్‌గారు. 'వదినా! నువ్వేమంటావ్?' అన్నది పిన్ని.

'ఆయన చెప్పారుగా భవానీ! అదే నా

అభిప్రాయం!' అన్నది సుశీలగారు.

'అయినవాళ్ల సంబంధం అయితే అరమరికలు లేకుండా కలిసి మెలిసి వుండొచ్చని అడిగాను. మావాడికి మంచి మంచి సంబంధాలే వస్తున్నాయి. అమ్మాయి అభిప్రాయం అడిగి ఏ సంగతి మాకు వెంటనే తెలియజేయండి!' అంది మా పిన్ని.

అక్కడే వున్న నేను ఆ సంభాషణ అంతా విన్నాను. బాబాయి ఏమీ మాట్లాడలేదు.

సుదర్శన్‌గారు బయలు దేరారు. నేనూ మాధవపురానికి ప్రయాణమయ్యాను.

'గౌతమ్! మా కారు మీ మాధవపురం పక్కగానే పోతుంది గదా! నిన్ను అక్కడ దించుతాం! రా! కారులో కూర్చో!' అన్నారు. కాదంటే బాగుండదని సరేనన్నాను. నన్ను ముందు సీటులో ఆయన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. కారు మాధవపురం ఊరు పక్కకి వచ్చింది. సుదర్శన్‌రావుగారు కారు ఆపారు. నా వైపు చూసి.

'గౌతమ్! నీకు మా సుజాతని చేసుకోవటం ఇష్టమేనా? నిస్సంకోచంగా చెప్పు!' అన్నారు.

అది నేను కలలో కూడా ఊహించని ప్రశ్న! ఆశ్చర్యంతో నోటమాట రాలేదు.

'ఆశ్చర్యంగా వుందా గౌతమ్? నిజంగానే అడుగుతున్నాం. ఇలాంటి ప్రశ్నలు వినోదంగా ఎవరూ అడగరు. అందునా మేము ఇద్దరం న్యాయవాదులం!' అన్నది సుశీలగారు.

'గౌతమ్ మేము కాసులకోసం అడ్డమైన కేసులు తీసుకొని దోషుల్ని కాపాడే న్యాయవాదులం కాదు. అలా చేస్తే న్యాయానికి అన్యాయం చేసినట్లవుతుంది. న్యాయవాదవృత్తికీ ధర్మం వుంది. ఆ ధర్మాన్ని మేం పాటిస్తున్నాం! మాకు సంపద ముఖ్యం కాదు. గుణసంపద కావాలి! సంపద మాకు వుంది. గుణసంపద నీకు వుంది. నీ గురించి సుజాత మాకు వివరంగా చెప్పింది. నీ అందం, ఆత్మ సౌందర్యం, శ్రమైక జీవన సౌందర్యం, అన్నీ సుజాతకి నచ్చాయి.

నీకు సుజాత నచ్చితే నిన్ను చదివించి సుజాతను, నిన్ను, న్యాయవాదుల్ని చేస్తాం! మీ గురువు ఆత్రేయగారు మా కుటుంబ మిత్రులు. ఆయన నీ జీవిత చరిత్ర అంతా చెప్పారు. మా సుజాత కోరిక విని ఆనందించారు. అసలు మేము విజయపురం వచ్చింది నీకోసమే! వేరే పని అంత ముఖ్యమైనదేమీ కాదు.

–ఇది నీకు అంగీకారమైతే ఈ కారులోనే నిన్ను మా ఇంటికి తీసుకువెళ్తాం' అన్నారు సుదర్శన్‌రావుగారు. వారి మాటలు నాకు ముందుగా ఆశ్చర్యం, తరువాత ఆనందం కలిగించాయి.

'మా గురువుగారు ఆత్రేయగారు మీ కుటుంబ మిత్రులు కావటం నాకెంతో ఆనందంగా ఉంది. వారు నాకు దైవ సమానులు. వారి కోరిక నాకు శిరోధార్యం! సుజాతవంటి రూపవతి, గుణవతి, భార్య కావటం నాకూ సంతోషమే! అయితే మీకొక విన్నపం. మాధవపురంలో రాములమ్మ అనే యాదవ మహిళ నాకు మాతృ సమానురాలు. అమ్మానాన్నల మరణానంతరం నేను దుఃఖంలో వుంటే ఆమే నన్ను కన్నతల్లిలా ఓదార్చింది. ఆ ఆదరణ నేను మర్చిపోలేను. ఆ అమ్మకి ఈ శుభవార్త చెప్పి ఆమె ఆశీస్సులు అందుకొని మీ ఇంటికి వస్తాను. అడ్రసు ఇవ్వండి!' అన్నాను.

'ఆహా గౌతమ్! నీ సౌజన్యం, కృతజ్ఞతా భావం ప్రశంసనీయం! ఆ రాములమ్మ నీ పట్ల చూపిన ఆదరణ గురించి ఆత్రేయగారు నీ చరిత్ర చెబుతూ మాకూ చెప్పారు. ఆ మాతృమూర్తిని మేమూ చూస్తాం! ఆమెనే వియ్యపురాలుగా సంభావిస్తాం! ఆమె ఆశీస్సులతోనే నువ్వు మాతో రావచ్చు! పద! మాకు మాధవపురం దారి చూపించు!' అన్నారు సుదర్శన్‌గారు.

వారికి దారి చూపించాను. కారు మాధవపురం వైపు మళ్లింది.

★

ఇష్టపదులు

- వింజమూరి అచ్యుతరామయ్య

వజ్ర 'సుందరుడు'
పిఠాపురంలో మరో
అక్షరశక్తి పీఠం

• • •

నెలకో శుక్లపక్షమే వెన్నెల
'కృష్ణారావు'గారిల్లు
కృష్ణపక్షమైనా వెన్నెలే

• • •

పల్లె పల్లెనా 'అద్దేపల్లి'ని
అక్షరం హత్తుకుంటూ వుంటుంది
గజల్ గానం జర మధురం

• • •

ముళ్ల అంచు కవిత్వం
పరిమళించు భాషజం
'మో' ఓ మొగలిపొద

• • •

కథకుడు ముఖచిత్ర మకుటుడు
కవి'శీలావీ'
స్నేహానికి వూటబావి

• • •

'పెన్నాది' విశేష రచనల పెన్ను
విభిన్న కోణాల
సాహితీ కన్ను

• • •

అదుగో ద్వారక...
కృష్ణుడికి బదులు 'శివుడు'
గోపికలకు బదులు కవులు

• • •

ఏ నగరాన బస చేసినా
'ఎండ్లూరి' శబ్దం చేస్తూ
రాత్రి సూర్యుడై పలకరిస్తూ ఉంటాడు

• • •

నల్లగేటు దాటిన వూసులు
అక్షరాలా మణిపూసలు
'శిఖామణి' ఓ తెల్ల నంది వర్ధనం

• • •

వానరాని కాలంలోనే
కవిత్వదాహం తీర్చిన 'దేవదానం'
యానాం చరిత్రకో రారాజు.

కవిత్వమ్

గుణనిధి తల్లి

- కె. ఆంజనేయ కుమార్

కన్నీళ్లను గుప్పిట పట్టి
ఆకాశం తలపై నక్షత్రాలుగా చల్లుతున్న
సంస్కృతీ పరిరక్షకులెవ్వరు?
ముకుళించిన జాబిల్లి చేతులతో
ఆకాశం, చీకటికి సాష్టాంగ పడిందని
ఆరోపిస్తున్న మత మమకారులెవ్వరు?
ఆకాశం సరిగా దుస్తులు వేసుకోక
అరకొర దుస్తుల్లో, పబ్బుల్లో కనబడటం వల్లనే
కదా...
అందరికీ కామకాంక్ష కల్గుతోందని అంటున్న
మతం కల్లు తాగిన మత హాలిక్కులు ఎవరు?
రాళ్లు వేస్తూ, దాడులు చేస్తూ
పబ్ మబ్బుల్లోని రాజకీయ కళాయిలో
మరకల ముతాలిక్‌ల చేత
తలవంపుల తాలింపులు వేయిస్తున్న వారెవ్వరు?
ముతాలిక్! ముతాలిక్!!
రేకులు విప్పింది కాబట్టే...
పువ్వుల్ని నలిపేస్తున్నామనే వాళ్లు...,
మరి చెడ్డీ కూడా వేసుకోవడం చేతకాని
పసినెలల మొగ్గల్ని కూడా కామాగ్నితో
బుగ్గిపాలు చేస్తున్నారెందుకు?
ఈ దేశ పాఠ్య పుస్తకాల్లోని పాఠాల్లో....
అమ్మ వంట చేస్తుంది...
చెల్లెలు అంట్లు తోముతుంది...
నాన్న పుస్తకాల్లో విజ్ఞానం పెంచుకుంటాడు...
అన్నయ్య బజార్లో క్రికెట్ ఆడతాడు....
పాఠశాలల్లో ఇలాగే చెప్పి...
సినిమాల్లో ఇలాగే చూసి
ఇళ్లల్లో ఇలాగే ఆచరించి
వయస్సుతో నిమిత్తం లేకుండా
ఆడతనాన్ని బానిసగా...
తమస్సు కత్తుల దాకా
ఖాళీలేని భావజాలంతో నింపాక....
గుణనిధి చెడిపోవడానికి కారణం...
తల్లే అంటూ
చెంప ఛెళ్లు మనిపిస్తారెందుకు?
మూర్ఖాలిక్.... మూర్ఖాలిక్...
సంస్కృతీ పరిరక్షణ అంటూ
ఆటవికులు కూడా ఆనాడే

కనబడిన వారందరినీ నీలాగే దేహశుద్ధి చేస్తే....
కనబడే మతం దుస్తులతో ఓట్ల దేహశుద్ధికి
ఈనాడెలా కషాయం కక్కేవాడివి?
ఈనాడెలా కషాయం కట్టేవాడివి?
అలవోకగా సప్త సముద్రాలు దాటిన
ఆంజనేయుడి బొమ్మ.. నీదే కదా!
మరి ఒబామా చేతిలో వుండి కూడా...
దేశ ప్రజలు ఎగిరి వెళ్లడానికి వీలుగా
వీసాలను రక్షించలేకపోయిందేమిటి?
మూర్ఖాలిక్... మూర్ఖాలిక్...
సంస్కృతి అంటే ఏమిటి?
ప్రాణమున్నా, లేకున్నా ప్రేమలా ప్రతిదీ సంస్కృతే
కదా!
కుర్చీకి నాలుగు కాళ్లుంటేనా సంస్కృతి?
మరి... ముక్కాలి కుర్చీలని సంస్కృతిలో
కూర్చోనివ్వరా?
తనకు కాని పనిలో తలదూర్చేవాడు....
పంచతంత్రం కథలో
కొంత వరకు రంపంతో కోసిన దూలంలోని
కొయ్య మేకును ఊడబెరికిన కోతి
చీలికలో నలిగిపోయి చనిపోయినట్టు....
ముతాలిక్ నువ్విప్పుడు
పింక్ చెడ్డీల కుప్పకింద ఊపిరాడక చస్తున్నావా?
ముతాలిక్... నీ పుణ్యమా.. అని
నిరసన రంగు... నలుపు తల దించుకుంది
దోషిలా...!
పింక్ చెడ్డీలు వేసుకుని రాజకీయ నాయకులు
మీడియా ప్రకటనల్లో మోడళ్లై...
అన్యాయ పరిణామాల్ని సమర్థించే చదరంగంలో
పావులుగా పాటుపడుతున్నారు. ★

ఓ మంచి పుస్తకం

సోవియట్ ప్రజల త్యాగాల హవిస్సు 'ఇంద్రధనస్సు'

- తె.ర

సారస్వతాన్ని స్థూలంగా రెండు రకాలుగా విభజిస్తుంటారు. రాజకీయ, విజ్ఞాన ఆర్థిక తదితర శాస్త్ర సంబంధమయిన గ్రంథాలు మొదటిరకం, కథ నవల నాటకం, కవిత తదితర సృజనాత్మక సాహిత్యం రెండవ రకం. మొదటి రకం గ్రంథాలు మనుషుల మేధకు పదును పెడతాయి. అవగాహనను విస్తృతపరుస్తాయి. ఇక నవల, కథ, కవిత వంటివి నేరుగా హృదయసీమలను తాకి రసావిష్కరణగావిస్తాయి. ఆయా అంశాలను అంతరంగంలో హత్తుకుపోయేలా చేయగలశక్తి నవలలకున్నంతగా ఇతర ప్రక్రియలకు లేదు. పురుషులందు పుణ్యపురుషులు వేరన్నట్లే నవలలందు ఉత్తమ నవలలు వేరే వుండనే వుంటాయి. అలాంటి ఉత్తమ సాహిత్యానికి దేశాల సరిహద్దులు, కాలచక్రం తాకిడులు వుండవు. విశ్వజనీనమైన ఉదాత్తవిలువలతో దేశదేశాల ప్రజానీకాన్ని అలాంటి సాహిత్యం ఉత్తేజపరుస్తూనే ఉంటుంది. కేవలం క్షణికోద్రేకాలు రెచ్చగొట్టే క్షుద్రసాహిత్యం వలెగాక వాందావసిలెవస్కా రచించిన "ఇంద్రధనుస్సు" అలాంటి ఉత్తమ నవలలో అత్యుత్తమ శ్రేణికి చెందినది. రెండో ప్రపంచ యుద్ధంలో రెండు కోట్ల మంది సోవియట్ ప్రజానీకం ప్రాణత్యాగం చేశారని ఎన్నో కష్టనష్టాలను భరించారని మనకు తెలుసు. ఆ త్యాగనిరతిని, ధీరదాత్తతను అద్భుతంగా చిత్రించిన మరపురాని మహత్తర నవలే 'ఇంద్రధనస్సు.'

ఎప్పుడో 1950లో వెలువడి స్టాలిన్ బహుమతినందుకొన్న ఈ నవల 1987లో "ప్రజాశక్తి" డైలీ సీరియల్‌గా వెలువడిననాడు కూడా అంతే స్పందన కలిగించింది. విషయ గాంభీర్యం, శిల్పనిర్మాణం ఉదాత్తపాత్ర చిత్రణ, చారిత్రక వాస్తవికత ఇవన్నీ కలిసి "ఇంద్రధనుస్సు"కు అంత విశిష్టత చేకూరాయి. కీర్తిశేషులు మానేపల్లి తాతాచార్యవారి అనువాదం ఆపాతమధురంగా, హృద్యంగా సాగింది. నవలలో వూర్లు మనుషులూ, పేర్లు అన్నీ విదేశీయమైనవే అయినా పాఠకుడికి ఎక్కడా "పరాయితనం కనిపించదు. ఫాసిస్టుమూకల క్రౌర్యం, అందుకుప్రతిగా నిలిచిన సోవియట్ ప్రజల శౌర్యం పోటీపడి నవల అడుగడుగునా ఉత్కంఠతతో నడుస్తుంది. అనేక చోట్ల ఆర్ద్రతతో కళ్లు చెమరుస్తాయి. ఒక్కోసారి ఫాసిస్టులపై కోపంతో గుండెలు మండిపోతాయి. దేశం కోసం సర్వం త్యాగం చేసిన సోవియట్ స్త్రీ పురుషుల, మాతృమూర్తుల, వీరపుత్రుల, భార్యలు, భర్తలు ధైర్యసాహసాలు మనల్ని వుక్కిరిబిక్కిరి చేసి నూతన స్ఫూర్తినిస్తాయి.

నాజీ ఆక్రమిత సోవియట్ ప్రాంతాల పరిస్థితిని ఈ నవల చిత్రిస్తుంది. తక్కిన దేశం చాలా వరకు ఫాసిస్టులను తరిమికొడుతున్న దశలో కూడా నాజీల ఉక్కు పిడికిలిలో చిక్కి వీరోచితంగా నిలిచిన ఒక గ్రామ ప్రజల కథ ఇది. వారు పెట్టిన చిత్రహింసలను, మారణకాండను తట్టుకుని చివరకు ఎర్రసైన్యాల రాకతో విముక్తి సాధించగలగడం ఇందులో చూస్తాం. నాజీ నరహంతకులు చంపి పారేసిన తన కొడుకు మృత కళేబరాన్ని చూసుకోవడానికి ఫెడోసియా రహస్యంగా వచ్చే ఘట్టంతో నవల ప్రారంభం అవుతుంది. మొదట మూడు పేజీలలో ఆమె తన కొడుకు శవాన్ని చూసుకోవడం, ఘటనలను నెమరువేసుకోవడం జరుగుతుంది. ప్రారంభంలోనే పాఠకుడు ఆ మాతృమూర్తి ఆవేదనకు కదిలిపోతాడు. అక్కడి నుండి చివరకు ఆ గ్రామంలో ఎర్రసైన్యం ప్రవేశించి విజయఢంకా మోగించేదాకా నవల యావత్తూ అద్భుతంగా నడుస్తుంది.

ఎంత కాలమో నిరీక్షించిన అనంతరం అపురూపంగా కన్న గారాల కొడుకును ఫాసిస్టులు క్రూరంగా బలిగొని తనను చెప్పరాని చిత్రహింసలు పెట్టినా చెక్కుచెదరని ఒలెనా, ఆమె చెల్లెలై వుండి కూడా ఫాసిస్టు అధికారి కర్ట్ వెర్నర్‌తో చేయి కలిపి ఉంపుడుగత్తెగా మారిన నీచురాలు పుస్సీ, ఒలెనాకు రొట్టె ఇవ్వబోయి తూటాలకు బలైన చిన్నారి బాబు మిష్కా, అష్టకష్టాలు పడి కొడుకు మిష్కా శవాన్ని తెచ్చి ఫాసిస్టులకు తెలియకుండా ఇంట్లోనే ఖననం చేసిన తల్లి మాల్యూచికా, ఇలాంటి అసాధారణ పాత్రలెన్నో మనకు తారసపడతాయి.

> **ఎంత కాలమో నిరీక్షించిన అనంతరం అపురూపంగా కన్న గారాల కొడుకును ఫాసిస్టులు క్రూరంగా బలిగొని తనను చెప్పరాని చిత్రహింసలు పెట్టినా చెక్కుచెదరని ఒలెనా, ఆమె చెల్లెలై వుండి కూడా ఫాసిస్టు అధికారి కర్ట్ వెర్నర్‌తో చేయి కలిపి ఉంపుడుగత్తెగా మారిన నీచురాలు పుస్సీ, ఒలెనాకు రొట్టె ఇవ్వబోయి తూటాలకు బలైన చిన్నారి బాబు మిష్కా అష్టకష్టాలు పడి కొడుకు మిష్కా శవాన్ని తెచ్చి ఫాసిస్టులకు తెలియకుండా ఇంట్లోనే ఖననం చేసిన తల్లి మాల్యూచికా, ఇలాంటి అసాధారణ పాత్రలెన్నో మనకు తారసపడతాయి.**

అనుక్షణం అప్రమత్తంగా అతిగుప్తంగా పని చేయవలసిన ఆ కాలంలో మొత్తం గ్రామ ప్రజానీకమంతా ఒక్క మనిషిగా వ్యవహరించి, శత్రువును ముప్పుతిప్పలు పెట్టిన తీరు ముగ్ధులను చేస్తుంది. నీడను కూడా నమ్మడానికి లేని ఆ కాలంలో అత్యంత జాగరూకులై, ఉక్కు శిక్షణతో వ్యవహరించిన తీరు ఉత్తేజితులను చేస్తుంది. అవసరమైనదానికన్నా ఒక్కముక్క అదనంగా చెప్పబోయినా వారు విన నిరాకరిస్తారు, ఫాసిస్టులు మాల్యూచికా బదులుగా చకోరికను బంధిస్తారు. అయినా ఆమె నిర్భయంగా వెళ్ళిపోతుంది. అది భరించలేని మాల్యూచికా ఆమె చకోరికాకు సంబంధించిన గ్రోహచ్ భార్యకు ఆ విషయం చెప్పబోతుంది. వెంటనే ఆమె మాల్యూచికాను చీవాట్లు పెట్టి పంపిస్తుంది. ఫాసిస్టుల ఖైదుల్లోని ఓల్గా ఆ ముష్కరులు తనను మానభంగం చేసిన ఘటనను మరచిపోలేక నిరంతరం మదనపడుతుంటే మొదట సానుభూతి చూపిన చకోరికాయే ఆ తర్వాత ఆమెను మందలించి సరైన ఆలోచన కలిగిస్తుంది. కొడుకుని కోల్పోవడమేగాక కర్ట్, పుస్సీల ఇంట్లో పనిమనిషిగా వుండవలసి వచ్చిన ఫెడోసియా ఏజెంటుగా పనిచేసి, చివరకు ఎర్రసైన్యాలను కలుసుకొని వారి రాకకు సన్నాహాలు చేస్తుంది. ఆ ఘట్టం చదివిన పాఠకులకు ఆనందం చిందులువేస్తుంది. ఇలాంటి పాత్రలు మన హృదయాల్లో శాశ్వతంగా నిల్చిపోతాయి. ★

అల్లం పచ్చడి

కావలసిన పదార్థాలు

అల్లం - 200 గ్రాములు, చింతపండు - పెద్ద నిమ్మకాయంత, బెల్లం - నిమ్మకాయంత, ఎండుమిర్చి - తగినన్ని, ఉప్పు - తగినంత ఆవాలు - కొంచెం, మెంతులు - కొంచెం కరివేపాకు - 2 రెబ్బలు, నూనె - 1 టేబుల్ స్పూను

తయారు చేయు పద్ధతి

అల్లం శుభ్రంగా కడిగి ఎండబెట్టి మెత్తగా దంచాలి. అందులోనే చింతపండు, బెల్లం కూడా వేసి దంచుకోవాలి. ఎండుమిర్చి, మెంతులు, ఆవాలు, కరివేపాకు వేయించి వాటిని కూడా మెత్తగా పొడి చేయాలి. అన్నీ కలిపి రోట్లో వేసి మళ్లీ మెత్తగా రుబ్బితే అల్లం పచ్చడి తయారవుతుంది. అల్లానికి కొంచెం బెల్లం ఎక్కువ వుంటేనే రుచిగా ఉంటుంది. నీళ్ల తడి తగలకుండా ఉంటే చాలా రోజులు నిల్వ వుంటుంది. లేదా ఎప్పటికప్పుడు కూడా దీన్ని తయారు చేసుకోవచ్చు.





పండు మిరపకాయల పచ్చడి

కావలసిన పదార్థాలు

పండు మిర్చి - 1కిలో

చింతపండు - పావుకిలో

ఉప్పు - 1డబ్బా

పసుపు - 1టేబుల్ స్పూను

మెంతులు - చారెడు

తయారు చేయు పద్ధతి

పండు మిరపకాయలు శుభ్రంగా తొడిమలు తీసి ఉప్పు, చింతపండు, పసుపు వేసి కచ్చాపచ్చాగా తొక్కి జాడీలో పెట్టుకోవాలి. మూడవ రోజు తీసి మరలా రోట్లో వేసి మెత్తగా రుబ్బి, మెంతులు వేయించి పొడి చేసి దీనిలో కలిపి జాడీలో పెట్టుకోవాలి. దీనిని కావలసినప్పుడు కొంచెం కొంచెం తీసి పోపు వేసుకొని వాడుకుంటే బావుంటుంది. వాడుకునే పచ్చడి గట్టిగా ఉంటే కొన్ని టమాటాలు చిన్న చిన్న ముక్కలుగా కోసి తాలింపులో వేసుకుంటే అన్నంలో కలుస్తుంది. ఈ పచ్చడి టిఫిన్లలోకి కావాలంటే కొంచెం పెరుగు వేసి కలుపుకుంటే అదోరకం రుచిగా బావుంటుంది. ఏదైనా తొందర సమయంలో టిఫిన్లలోకి పనికి వస్తుంది.

నిమ్మకాయ పచ్చడి

కావలసిన పదార్థాలు

నిమ్మకాయలు - 6

ఎండుమిర్చి - తగినన్ని

జీలకర్ర - కొంచెం

అల్లం - చిన్న ముక్క

ఆవాలు - కొంచెం

ఉప్పు - తగినంత

నూనె - 1టీ స్పూను

తయారు చేయు పద్ధతి

పండు నిమ్మకాయలు, ఉప్పు వేసిన నీళ్లలో ఉడక బెట్టాలి. తర్వాత గింజలు తీసి నూరి గుజ్జులా తయారు చేసుకోవాలి. ఎండు మిరపకాయలు కొద్దిగా నూనెలో వేయించి మెత్తగా నూరుకోవాలి. జీలకర్ర, అల్లం, ఆవాలు, నూనెలో వేయించి అందులో నిమ్మకాయల గుజ్జు వేస్తే నిమ్మకాయ పచ్చడి తయారవుతుంది. పులుపు ఎక్కువగా ఉంటుంది కనుక కొంచెం కారం ఎక్కువ తగిలినా పర్వాలేదు. నిమ్మకాయలు అప్పటికప్పుడు ఉడికించేకంటే ఉప్పులో ఊరేసిన నిమ్మకాయలు గానీ, నిమ్మకాయ ముక్కలు గానీ అయితే ఈ పచ్చడికి బావుంటాయి.



గోంగూర పచ్చడి

కావలసిన పదార్థాలు

గోంగూర - 2 కిలోలు

ఉప్పు - సరిపడా

తయారు చేయు పద్ధతి

గోంగూర కాడలు, పాడైపోయిన ఆకులు తీసేసి శుభ్రంగా కడిగి ఆరబెట్టుకోవాలి (పొడి బట్టపై. ఆకును పల్చగా పరిచి దానిపై మరలా పొడి బట్ట కప్పితే కొంచెం సేపటికి తడి పీలుస్తుంది). బాగా ఆరిపోయాక బాండీలో ఒక స్పూను నూనె, ఈ కూర వేసి మూత పెట్టాలి (సన్న సెగమీద పెట్టాలి). ఇది కొంచెం వేగిన తరువాత తిరగతిప్పాలి. ఇది మెత్తగా గుజ్జుగా అవుతుంది. ఇది ఒక బేసిన్‌లో వేసి చల్లారాక ఉప్పు, పసుపు వేసి కలియబెట్టి జాడీలో పెట్టుకోవాలి. మూడోరోజు తీసి పచ్చడి మెత్తగా తొక్కుకుని మరలా జాడీలో పెట్టుకోవాలి. కావాల్సినప్పుడు బాండీలో కొంచెం నూనె, కరివేపాకు కూడావేసి దంచాలి. మిరపకాయలు మెత్తగా అయ్యాక తగినంత పచ్చడి తీసి నూరుకొని తాలింపు వేసుకోవాలి. పచ్చిమిర్చి కూడా వేసుకోవచ్చు.

★

బీర్బల్ కథలు

కార్టూన్



దీన్ని ఏడ్పించు చూద్దాం!



ఆరు తేడాలేంటో...



ఎలా?

హలో ఫ్రెండ్స్... పైన బోలెడన్ని అంకెలు, గుర్తులు వున్నాయికదా. వాటిని = ఉపయోగించి చెప్పండి

జవాబులు

తేడాలేంటో... : చేపపైన ఉన్న నీళ్ల చుక్క, చేప కింద గడ్డి పీచు, కప్ప ఎడమ కాలి వేళ్లు, దాక్కున్న కప్ప నోరు, కొంగ పొట్టకింద ఉన్న గడ్డి, కొంగ రెక్క, కొంగ ఎడమ కాలు.

ఎలా? : 42-25=3+14

వెతుకుదామా...! : చిన్నచెట్లమధ్య యజమాని, కుక్కపిల్ల పైన, చెట్టుమీద టోపీ.

జంతువులెక్కడ? : రాక్షసుడి ఎడమకాలి దగ్గర ఒంటె తల, కింద ఎలుక తల, రాక్షసుడి ముఖంలో ఎడమ వైపు పక్షి, రాక్షసుడి తలకు చేతికి మధ్య కోడిపుంజు తల ఉన్నాయి.

రంగులేద్దాం: జిరాఫీలు

దారి కనిపెట్టేస్తే...

హాలో బుజ్జాయిలూ... కోడి ఒక కీటకాన్ని మింగేసింది. కానీ అది చావలేదు. బయటికి వద్దామా అంటే దారి తెలియక తికమక పడుతోంది. మీరేమైనా కనిపెట్టగలరేమో చూడండి.





రంగులేద్దాం

హాయ్ ఫ్రెండ్స్.... ఆకులకేమో లేత ఆకుపచ్చ, ఒక చుక్క ఉన్న చోట చాక్లెట్ రంగు, రెండు చుక్కలున్న చోట నలుపు, ప్లస్ గుర్తులున్న చోట పసుపు పచ్చ రంగులు వేయండి. అప్పుడు మీకు రెండు జంతువులు కనిపిస్తాయి. అవేంటో చెప్పాలి.

జంతువులెక్కడ?

హాయ్ ఫ్రెండ్స్.... ఇక్కడ సీసాలో ఒక రాక్షసుడు ఉన్నాడుకదా. ఆ రాక్షసుడితో పాటే ఒక పక్షి, ఓ కోడిపుంజు, ఒంటెతల, ఎలుక కూడా ఉన్నాయి. మరి అవెక్కడున్నాయో కనిపెడదామా...

వెతుకుదామా...!

పిల్లలూ... ఇక్కడున్న కుక్కపిల్లకి దాని యజమాని, యజమాని టోపీ ఎక్కడున్నాయో కనిపించడంలేదు. మనం కాస్త సాయం చేసి యజమానిని, టోపీ ని వెతికి పెడదామా.

ఓట్ల వేటలో

కోట్ల మూటలు.. కొత్త బాటలు...

- తెలకపల్లి రవి

భారత దేశాన్ని ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేర్కొంటుంటారు. మనకన్నా ఎక్కువ జనాభా గల చైనా కమ్యూనిస్టు దేశం గనక కావాలని పక్కన పెట్టి చేసే ప్రశంస ఇది. ఎలాగైనా ప్రపంచంలో మనది చాలా పెద్ద ప్రజాస్వామ్య ఎంపిక అనడంలో సందేహం వుండనవసరం లేదు. ప్రజలు తమను తాము పాలించుకునే వ్యవస్థ ప్రజాస్వామ్యం. కాకపోతే ఆ పాలించుకోవడం పార్టీల ద్వారా జరుగుతుంది. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన పార్టీ లేదా పార్టీల కలయిక దేశాన్ని పాలిస్తుంది. ఇందుకోసం జరిగే ప్రక్రియనే ఎన్నిక అంటున్నాము. ఎన్నికల్లో విస్తారమైన ఎంపిక అవకాశాలు వుండాలి. కాని తరచూ ఇది మిధ్యగా మారిపోతుంటుంది. ఎందుకంటే ఎన్నికల్లో నిలవడానికి, గెలవడానికి జనబలం ఒక్కటే గాక ఇతరత్రా అనేకాంశాలు ప్రభావం చూపడమే ఇందుకు కారణం. ఇండియా తర్వాత రెండవ పెద్ద ప్రజాస్వామ్య దేశంగా పిలిపించుకునే అమెరికాలో ఎప్పుడూ రిపబ్లికన్ డెమొక్రటిక్ పార్టీలు రెంటి మధ్యనే ఎన్నికల పోరాటం పరిమితమవుతుంటుంది. ఆ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మ బొరుసు అంటుంటారు. దాంతో పోలిస్తే మన దేశంలో పార్టీల సంఖ్య చాలా ఎక్కువ.వాటి మధ్య పోటీ కూడా వివిధ చోట్ల వివిధ రకాలుగా వుంటుంది. దీనివల్ల మన ఎన్నికల వ్యవస్థ పాశ్చాత్య దేశాలలో లేని విశాల స్వభావం బహుళత్వ స్వభావం సంతరించుకుంది. కాని కాల క్రమంలో మన దేశంలోనూ ఎన్నికల వ్యవస్థ అంతకంతకూ ఖరీదైన వ్యవహారంగా ఖరాబై పోవడం ఆందోళన కలిగించే విషయం.

2009

ఎన్నికల పోరాటం మొత్తం ఖర్చు పదివేల కోట్ల రూపాయలని ఇది అమెరికా అధ్యక్ష ఎన్నికల ఖర్చు కన్నా ఎక్కువని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ ఒక లెక్క వేసింది. అయితే వాస్తవంలో ఖర్చు అంతకన్నా అనేక రెట్లు ఎక్కువగా వుంటుందని అందరికీ తెలుసు.

భారత రాజకీయాలలో చాలా కాలం పాటు కాంగ్రెసే ఏకైక పాలక పక్షంగా కొనసాగింది. 1957లో కేరళలో తొలిసారిగా కాంగ్రెసేతర కమ్యూనిస్టు ప్రభుత్వం నంబూద్రిపాద్ నాయకత్వాన ఏర్పడింది. ఇంకో పదేళ్ళ తర్వాత ఇదే రీతిన మరి తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెసేతర సర్కార్లు కొలువు తీరాయి. 70వ దశకం మధ్య కాలానికి ఇందిరాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ దేశమంతటా వ్యతిరేకతను ఎదుర్కొన్నది. పైగా రాయ్‌బరేలిలో ఆమె ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు తీర్పునిచ్చింది. సవాలు చేస్తున్న ప్రతిపక్షాల ధాటికి నిలవలేని ఇందిరాగాంధీ ఎమర్జన్సీ విధించి దేశమంతటా తన నిరంకుశ పాలన సాగించారు. తన నిఘా విభాగంతో సర్వే జరిపించి 1977 మార్చిలో ఎన్నికలు జరిపించి ఓడిపోయారు. దేశంలోనే తొలి రాజకీయ ప్రకంపనం ఎన్నికల అక్రమాలతో ముడిపడి వుండటం గమనించదగ్గది. తొలి కాంగ్రెసేతర జనతా ప్రభుత్వం అంతర్గత విభేదాలు, కల్లోలాల మధ్య 1979లో కూలిపోవడంతో లోకసభకు 1980లో మధ్యంతర ఎన్నికలు అవసరమైనాయి. ఈ ఎన్నికల్లో ఇందిరాగాంధీ తను తిరిగి అధికారంలోకి రావడం కోసం అడ్వర్టయిజ్‌మెంట్ సంస్థ సహకారంతో 'పనిచేసే ప్రభుత్వం' అన్న నినాదం పట్టుకున్నారు. ఇప్పుడు మన సినిమాలకు కాప్షన్స్ ఇస్తున్నట్టుగా పార్టీ రాజకీయ ప్రచారానికి ఒక నినాదం తీసుకురావడానికి శ్రీకారం చుట్టారు. 1984లో ఆమె హత్యానంతరం రాజీవ్‌గాంధీ అఖండ విజయం సాధించినా బోఫోర్స్ తర్వాత చిక్కుల్లోపడ్డారు.

తేళ్లు పాముల ప్రచారం...

1989 ఎన్నికల్లో రాజీవ్ గాంధీ చుట్టూ మిగిలిన యువ నేతలు కార్పొరేట్ తరహా ప్రచారాన్ని తీవ్రం చేశారు. ఎన్నికలకు ముందే పేజీలకు పేజీలు ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా అడ్వర్టయిజ్‌మెంట్లు ఇవ్వడం మొదలెట్టారు. పాశ్చాత్య ప్రచార సంస్థలు అప్పట్లో ప్రతిపక్షాలను పాములు తేళ్లతో పోలుస్తూ అర్థం కాని అడ్వర్టయిజ్‌మెంట్లు గుప్పించడం అపహాస్యం పాలైంది. ఈ కార్పొరేట్ ప్రచార వ్యూహం పూర్తిగా బెడిసి కొట్టి విపిసింగ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అది కొద్ది కాలంలోనే కూలిపోవడంతో 1991లో ఎన్నికలు చూడాల్సి వచ్చింది. ఈ ఎన్నికలు తొలిదశ పూర్తయిన తర్వాత రాజీవ్‌గాంధీ హత్య జరగడంతో తర్వాత సానుభూతి పవనాలు మళ్లీ కాంగ్రెస్‌నే అధికారంలోకి తెచ్చాయి.

సంపూర్ణ కార్పొరేటీకరణ

పివినరసింహారావు హయాంలోనే మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా నూతన ఆర్థిక విధానాలు మొదలైనాయి. 1996 ఎన్నికలు భారీ ప్రచార యజ్ఞంగా మారిపోయాయి. కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతను అయోధ్య వివాదాన్ని తోడు చేసుకుని బలమైన శక్తిగా పెరిగిన బిజెపి కూడా విపరీతమైన ఆర్థిక వనరులతో రంగంలోకి దిగింది. ఇండియా ఎదురు చూస్తున్న మనిషి అంటూ వాజ్‌పేయిని కేంద్ర బిందువుగా చేసుకుని పెద్ద ఎత్తున ప్రచారం సాగించింది. నూతన ఆర్థిక విధానాల తర్వాత దేశంలో ఎన్నికల పోరాటం సమూలంగా మారిపోయిన సంగతి అప్పుడే విదితమైంది. వీటన్నిటి తర్వాత బిజెపి పెద్ద శక్తిగా రావడం, మెజారిటీ లేకున్నా ప్రభుత్వం ఏర్పాటు చేసి 13 రోజుల్లో భంగపడటం తెలిసిన విషయమే. తర్వాత 1998 ఎన్నికలు...ఇప్పుడు బిజెపి మతతత్వ వాసనలతో పాటు వాజ్‌పేయి సమ్మోహనశక్తి అనే దాన్ని ముందుపెట్టుకుని ఒక్క అవకాశం ఇమ్మంటూ ప్రచారం నడిపించింది..కార్పొరేట్ శక్తుల అండదండలు బిజెపికి పుష్కలంగా దక్కాయి. అధికారం చేపట్టి 1999లో విశ్వాస తీర్మానంలో ఓడిపోయింది. అంతకు ముందే కార్గిల్ యుద్ధం పూర్తయినందున కుహనా దేశభక్తిని, రాజకీయ రామభక్తిని రంగరించిన కషాయంతో కాషాయకూటమిని మరోసారి గద్దెక్కించడంలో కార్పొరేట్ ప్రచార తంత్రం చాలా వుంది.

వెలిగిపోలేదు...... రగిలిపోయింది....

బిజెపి అధికారంలో వున్న కాలం కార్పొరేట్ శక్తులకు స్వర్ణయుగమే.. మొత్తంపైన ఆర్థిక సూచికలు కూడా బాగానే వున్న దశ.అలాంటి తరుణంలోనే ఉప ప్రధాని అద్వానీ అఖిల భారత అడ్వర్టయిజ్‌మెంట్ అధిపతుల శిఖరాగ్ర సమావేశం ఒకదానికి హాజరైనారు. అక్కడ మాట్లాడుతూ దేశంలో వుండటం ఎంత హాయిగా వుంది..అందరూ ఫీల్‌గుడ్ అనుకుంటున్నారు కదా అని చెప్పారట. తన మాటలకు తనే మురిసిపోయి తర్వాత ఆ ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్‌ను ఎన్నికల నినాదంగా చేసుకున్నారు. 'భారత్ వెలిగిపోతోంది' అంటూ వాజ్‌పేయి ముఖారవిందంతో పేజీలకు పేజీలు ప్రకటను గుప్పించారు. కాని భారతీయులు అలా అనుకోలేదు. అనేక కారణాల వల్ల వారి కడుపు రగిలిపోతున్నది. అందుకే 2004 ఎన్నికల్లో బిజెపి కూటమిని ఇంటికి పంపించారు.

ఓటర్లపై వలలు....

ఎన్నికల్లో అంతిమ నిర్ణేతలు ఓటరు మహాశయులే. వాస్తవానికి అధికారమే ప్రధానంగా పరిగణించే రాజకీయ పక్షాలకు ప్రజలంటే ఓటర్లే. ఓటర్లను బుట్టలో వేసుకోవడం కోసమే ఏ వేషాలు వేసినా. నిజంగా వారిని బాగు చేసేందుకు ఏం చేయాలన్న ఆలోచన కంటే ఏ విధంగా ఓట్లు దండుకోవచ్చున్న భావనే వారిని నడిపిస్తుంటుంది. గత పాతికేళ్లలోనూ రాజకీయాల్లో ప్రత్యేకించి ఎన్నికల రంగంలో ధనం పాత్ర విపరీతంగా పెరిగిపోయింది. కోట్లు గుమ్మరించగలిగిన వారే అభ్యర్థులుగా అర్హులన్న అభిప్రాయం పెద్ద పార్టీల్లో ప్రబలిపోయింది. కాకపోతే అవినీతి ఆరోపణలు, కుంభకోణాల విస్ఫోటనంతో అప్రమత్తతా పెరిగింది. మీడియా విస్తరణ న్యాయవ్యవస్థ క్రియాశీలతలకు తోడు ఎన్నికల సంఘంలోనూ శేషన్ వంటి వారి శాసనం మార్పులు తెచ్చింది. అంతకు ముందు నుంచి ఎన్నికల ఖర్చుపై పరిమితులున్నా వాటిని ఎవరూ పట్టించుకునే వారు కాదు.శేషన్ వాటిని ఖచ్చితంగా అమలు చేయడం మొదలెట్టాడు. పత్రికల్లో అడ్వర్టయిజ్‌మెంట్లు గాని ఇతరత్రా ప్రచారార్భాటం గాని దేనికి ఎంత ఖర్చు జరిగిందనేది లెక్క గట్టేందుకు పరిశీలకులను పంపించడం మొదలెట్టారు. రాజకీయ పార్టీల ఖాతాల తనిఖీ పెరిగింది. వీటన్నిటితో ఎన్నికల సన్నాహాల అర్థం మారిపోయింది.

ఏమిటా మార్పులు...

రియల్టర్లు, పరిశ్రమాధిపతులు, మీడియాధినేతలు, సినీవర్గాలు, అందరినీ మించి మాఫియా మహాసేనానులు వీళ్లంతా తమ రాజకీయరంగ ప్రవేశం నిర్ణయించుకోగానే జనంపై అంటే ఓటర్లపై వశీకరణ వలలు విసరడం మొదలెడుతున్నారు. అంటే ఎన్నికల ప్రకటనకు ఎంతో ముందుగానే తాము ఆశించే స్థానాల్లో జనానికి సకల వర ప్రదాయకులుగా కనిపించేందుకు కాసులు కురిపిస్తుంటారు. సామూహికంగా ఉపయోగపడే వాటర్ టాంకర్లు పంపించడం, బస్ షెల్టర్లు కట్టించడం, నిర్మాణాలు చేపట్టడం, వైద్య శిబిరాలు, ఆటల పోటీలు, కొన్ని చోట్ల సాహిత్య సభలు, పుస్తకాల పంపిణీ, ఆలయాల్లో పూజలు-భజనలు, అనాథల పెళ్లిళ్లు, కుట్టు మిషన్ల పంపిణీలు, జాబ్ మేళాలు, క్రికెట్ కిట్ల పంపిణీ ఇలాంటి పనులు కొన్ని. పెళ్లి పందిళ్లలో ప్రత్యక్షమై తాళి బొట్టుతో సహా ఖర్చులు ఇవ్వడం, రోగగ్రస్తులను ఆస్పత్రులకు చేర్చడం, స్కూలు భవనాలు నీటి ట్యాంకులు వంటి వాటికి ఉదారంగా నిధులివ్వడం, సంస్థలకు ఉదారంగా విరాళాలు కురిపించి సద్భావన పెంచుకోవడం వగైరా వగైరాలు ఇందులో

రథాలు... రణన్నినాదాలు

మిగిలిన అన్ని విషయాల్లాగే ప్రచార పద్ధతుల్లోనూ కాలనుగుణమైన మార్పులు వచ్చాయి.మొదట్లో ప్రదర్శనలు సభలే ప్రధాన మార్గాలుగా వుండేవి. కాని 1982లో ఎన్‌టిఆర్ తెలుగుదేశం స్థాపించిన తర్వాత చైతన్యరథంపై వూరూరా పర్యటించి ప్రచార పర్వాన్ని కొత్త మలుపు తిప్పారు. ఆయన రథం అహోరాత్రాలు ఆంధ్రప్రదేశ్ నలుమూలలా సంచరించి సంచలనం తెచ్చింది. అప్పటి నుంచి ఎన్నికల రథాలు ఇతరులకు కూడా నమూనాలైనాయి.1985లో కర్ణాటకలో రామకృష్ణ హెగ్డే అదే పద్ధతిననుసరించారు.1989లో హర్యానాలో దేవీ లాల్ డిటో.. ఎల్‌కె అద్వానీ విదేశీ కారును రామరథమంటూ వూరేగి రాజకీయ కీల రగిల్చారు. ఇప్పుడు ఎక్కడ ఎన్నికలైనా ప్రధాన నాయకులు ప్రచారరథం ఉపయోగిస్తున్నారు. దీనివల్ల ఎక్కడికైనా వెళ్లడానికి రథంపైనుంచే మాట్లాడ్డానికి వీలు కలుగుతున్నది. ఇప్పుడు చిరంజీవి కూడా అదే మార్గాన్ని అనుసరించారు. బాలకృష్ణ ఇప్పటికే రంగంలోకి దిగి రాష్ట్రాన్ని చుట్టబెడుతుండగా జూనియర్ ఎన్టీఆర్ బాబాయిబాటనే అనుసరిస్తున్నారు.పైగా అన్ని విషయాల్లో తాతయ్యనే అనుకరించబోతున్నారు. రథాలతో పాటే రోడ్‌షోలు కూడా ఇప్పుడు ప్రధాన ప్రచార పద్ధతులై పోయాయి.



గాల్లో తేలినట్టుందే.....



ఎన్నికల ప్రచార వ్యయంలో సింహభాగం అగ్రనేతల విహంగ యానమే. గత పదేళ్లలోనూ ప్రధాన నాయకులు ఎన్నికలు దగ్గర పడిన తర్వాత హెలికాప్టర్లలో చక్కర్లు కొడుతూ ప్రచారం చేయడానికి ప్రాధాన్యత నిస్తున్నారు. దీనివల్ల తక్కువ సమయంలో ఎక్కువ చోట్ల తిరగొచ్చనేది పాయింటు. 99కి ముందు కేవలం హోదా కోసమే వాడిన హెలికాప్టర్లు ఇప్పుడు అవసరంగా మారిపోయాయి. దేశంలో మొత్తం యాభై మంచి హెలికాప్టర్లు అద్దెకు లభిస్తాయని అంచనా. ఇందుకు సంబంధించి 20 సంస్థల వరకూ వున్నాయి. ఇందులోనూ రెండింజన్ల హెలికాప్టర్లకు గిరాకీ ఎక్కువ. ఎందుకంటే సురక్షిత ప్రయాణానికి అవే మెరుగంటారు. వీటికి గంటకు రెండు లక్షల వరకూ కిరాయి తీసుకుంటే సింగిల్ ఇంజన్ కాప్టర్లకు లక్ష ముట్టచెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా పవన్ అనే ఆధునిక హెలికాప్టర్‌లో వైఎస్ ఇప్పటివరకూ దర్జాగా తిరిగారు. ఇకపై ఆ ఛాన్సు వుండదు. ఆయనా డబ్బు కట్టాల్సిందే. తమాషా ఏమంటే వాటిని వాడుకుని డబ్బు కట్టని ఉదంతాలు గతంలో వున్నాయి. ఈ హెలికాప్టర్ల వినియోగంలో మహారాష్ట్రదే అగ్రస్థానం.అక్కడ ఒక్క కాంగ్రెస్సే 20 బుక్ చేసుకుందట. ఇదే గాక పది బుల్లి జెట్ విమానాలు కూడా తీసుకుంటున్నది. వీటితో పాటు మామూలు విమానాలలో ప్రయాణాలు కూడా పెరుగుతాయి. వీళ్లలో ఎక్కువ మంది వివిపిలు కనక భద్రతా ఏర్పాట్లు భారీగానే వుండక తప్పదు. దేశంలో విమానయానం ఈ సమయంలో కనీసం 5 శాతం పెరుగుతుందని విమానాల సంఖ్య 700 కాగా 750 కి చేరుకుంటుందని నిపుణు ల అంచనా. కనక భూతలంపైనే కాదు ఆకాశంలోనూ ఎన్నికల దెబ్బ తప్పదన్నమాట

భాగమే. ఇవేగాక ఇంటింటికి సెల్‌ఫోన్లు గట్రా పంపించి బస్సు సీట్లో తువ్వాలు వేసినట్టు ఓట్లు రిజర్వు చేసుకుంటారు. అదే పేదలకైతే ఇంటికో పాతిక కిలోల బియ్యం పంపిస్తారు.కొత్తబట్టలతో పసుపు కుంకాలు పంపిస్తారు. ఓటర్లను లెక్కకట్టి నోట్లు పంపిస్తారు. ఇదంతా ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందుగానే జరిగిపోతుంది గనక ఎన్నికల ఖర్చులోకి రాకుండా పోవచ్చు. ఇంతా చేశాక టికెట్ రాకపోతే ఎలా అంటారా.. అదృష్టాన్ని పరీక్షించుకోవడమే!

భారతదేశంలో ఓట్లు అమ్ముకోవడం పెద్ద జాడ్యమని అందరూ విమర్శిస్తుంటారు. ఇటీవలే సిఎంఎస్ జరిపిన సర్వేలో దక్షిణాదిన ఇది మరీ ఎక్కువగా వున్నట్టు వెల్లడైంది. ఆంధ్రప్రదేశ్‌లోనైతే నిరుపేదల్లో నూటికి 94 మంది ఓటుకు నోటు తీసుకుంటారని ఆ సర్వే చెబుతున్నది. దీనంతటికీ పేదరికమే కారణమని చెప్పనవసరం లేదు. కాని మధ్యతరగతి వారు చదువుకున్న వారు కూడా ఎన్నికల తాయిలాల కోసం ఎగబడుతున్నట్టు అనేక సందర్భాల్లో వెల్లడైంది..

బోనులో దొరికిన ఓట్ల వేటగాళ్లు

వాజ్‌పేయి పోటీ చేస్తున్న లక్నోలో చీరల పంపిణీ చేస్తే తొక్కిసలాటలో పలువురు మరణించిన సంగతి తెలిసిందే. విజయశాంతి పర్యటనలోనూ ఇలాంటి అపశ్రుతి చోటు చేసుకుంది. ఇక తమిళనాడులోనైతే తిరుమంగళం నియోజకవర్గంలో ఓటర్లకు డబ్బు పంచుతున్నందుకుగాను ముఖ్యమంత్రి కరుణానిధి కుమారుడు, రాజకీయ వారసుడు స్టాలిన్‌పై కేసు నమోదు చేసింది. 45 లక్షల రూపాయలను ఇందుకోసం వెచ్చించినట్టు ఆరోపణలే అన్నాడిఎంకెపైన కూడా రావడంతో నోటీసు ఇచ్చింది. కర్నాటకలోనైతే ఈ ఎన్నికల నోటిఫికేషన్ తర్వాతే భారీ ఎత్తున మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎన్నికల కోసం మద్యం ఉత్పత్తి ఎన్నోరెట్లు పెంచినట్టు లెక్కలు చెబుతున్నాయి.

కొత్త పద్ధతుల్లో ప్రచారం

మద్యం, డబ్బు, పంపిణీ పాత పద్ధతి కాగా సాంకేతిక వికాసం ఫలితంగా అనేక సరికొత్త విధానాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. మొన్నటి వరకూ మన రాష్ట్రంలో టీవీలలో కోడి పిల్లల యాడ్స్ విపరీతంగా వచ్చాయి. వీటిలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కోడిపిల్లలు మాట్లాడుకోవడం చూపించేవారు. తర్వాత ఆ కోడిపిల్లలు నిజానికి తోడేళ్లను చూపిస్తూ కాంగ్రెస్ యాడ్ విడుదల చేసింది. దాంతోపాటే చంద్రబాబుపై ఆరోపణలతో కరోడ్‌పతి తరహా యాడ్ తయారు చేసింది. దీనికి విరుగుడుగా తెలుగుదేశం ముఖ్యమంత్రి ఆత్మ ఆయన అవినీతి గురించి మాట్లాడుతున్నట్టు యాడ్ ఇచ్చింది. ఎన్‌టిఆర్ పదవీచ్యుతుడైనప్పుడు చంద్రబాబును విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారంలో పెట్టింది. ఈ స్థాయిలో కాకపోయినా ప్రజారాజ్యం కూడా తన వంతు తంటాలు పడింది. కోడ్ ప్రకారం ఒకపార్టీ తన గురించి చెప్పుకోవచ్చుగాని మరొకరిని విమర్శించకూడదు. కాని ఈ విధంగా ఎన్నికలు కొద్ది దూరంలో వుండగానే ఒక దఫా ప్రచార యుద్ధం జరిగిపోయింది. ప్రభుత్వం కూడా అడ్వర్టయిజ్‌మెంట్ల ధోరణి మార్చి వార్తల రూపంలో పతాక శీర్షికల స్థానంలో యాడ్స్ ఇవ్వడానికి వందల కోట్లు ఖర్చు చేసింది. ప్రజారాజ్యం పార్టీ ఏర్పడ్డానికి ముందే సినిమా కవులతో పాటలు రాయించి విడుదల చేయించింది. ఇప్పుడు అదే కవులు కాంగ్రెస్ పాటలు కూడా రాశారు. తెలుగుదేశం కూడా కళాకారుల బృందాలను పెద్ద ఎత్తున రంగంలోకి దింపుతున్నది. కమ్యూనిస్టు పార్టీల తరపున ప్రజాకళాకారులు ఎప్పుడూ ప్రచారంలో వుండనే వుంటారు. వారు కూడా ఇప్పుడు శిక్షణ శిబిరాలు పూర్తి చేసి క్యాసెట్లు విడుదల చేస్తున్నారు. ఇదంతా తెలుగు నాట ఎన్నికల సంరంభాన్ని తారాస్థాయికి చేర్చనున్నది. మరో వైపున ఎన్నికల సంఘం మాత్రం ఇప్పటి వరకూ ఏర్పాటు చేసిన రెండు లక్షల ఫ్లెక్సీలను, బ్యానర్లను తొలగించింది. గోడలపైన రాసిన నినాదాలు చెరిపేసింది.

సంప్రదాయ ఎన్నికల చిహ్నాలైన జెండాలు, తోరణాలు, బ్యానర్ల వంటివి ఎలానూ వినియోగిస్తారు గాని వాటిపైన కూడా లెక్కలు వుంటాయి.

ఎన్నికల ర్యాలీలలో వుపయోగించే కార్ల సంఖ్య కూడా లెక్కలోకి వస్తుంది గనక వాటిని కూడా పరిశీలిస్తున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘంతో పాటు కెజెరావు నాయకత్వంలో ఒక స్వతంత్ర బృందం కూడా పనిచేస్తోంది.



సందేశాలు.. సంకేతాలు

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఎస్.ఎం.ఎస్‌ల వంటివాటి ద్వారా లక్షలాదిమంది ఓటర్లను చేరుకోవడానికి రాజకీయ పార్టీలు తంటాలు పడుతున్నాయి. వెబ్‌సైట్లు ఏర్పాటు చేస్తున్నారు.

టీవీలు, ఎఫ్ఎం రేడియోలు ప్రధానంగా వాడుకోవాలని చూస్తున్నారు. బిజెపి అయితే ఇప్పటికే తన ప్రచార కార్యక్రమాన్ని ఫ్రాంక్ సైమన్స్, యుతోపియా అనే రెండు ప్రముఖ యాడ్ సంస్థలకు అప్పగించింది. 'మజ్బూత్ నేత-నిర్ణాయక్ సర్కార్ (బలమైన నేత, నిర్ణాయక ప్రభుత్వం) అన్నది నినాదంగా ఎంచుకుంది. ఎఫ్ఎం ద్వారా 280 నియోజకవర్గాలకు చేరుకోవచ్చని బిజెపి ఆశ.

ఎం.పి. మధుపై దౌర్జన్యానికి పాల్పడిన మంత్రి

పచ్చబొట్టు చెదిరిపోదులే అని పచ్చబొట్లు (టాటూలు) కూడా ఎన్నికల కోసం సిద్ధమవుతున్నాయి. రాజే ఎంటర్‌ప్రైజెస్ ఈ పనిలోనే నిమగ్నమై వుంది.

ఆస్కార్ బహుమతి పొందిన స్లమ్‌డాగ్ చిత్రంలోని జయహో పాట ప్రచార హక్కులు తీసుకున్నది కాంగ్రెస్ పార్టీ.

ప్రధాని కావాలని ముచ్చటపడుతున్న అద్వానీ ఒక వెబ్‌సైట్ తెరచి యూనివర్సిటీలపై ప్రధానంగా గురిపెడుతున్నారు.

రాహుల్ గాంధీ, సచిన్ పైలెట్, ఒమర్ అబ్దుల్లా వంటివారు ఫేస్ బుక్ ను వాడుతున్నారు.

మీరు ఎంబిఎలో చేరడానికి దిగులు పడవద్దని వైఎస్ పేరిట సందేశం యువతకు అందుతున్నది. మీ మద్దతుతో మీ కోరిక నెరవేరుస్తానని అందులో ఆయన చెప్పడం కొసమెరుపు. చంద్రబాబు పేరిట పండగ శుభాకాంక్షలు మొదలు అనేక రకాలైన సందేశాలు వస్తూనే వున్నాయి. ఇందుకోసం తెలుగుదేశం ఒక ప్రత్యేక విభాగమే ఏర్పాటు చేసింది. కెసిఆర్ పేరుతో విద్యార్థులకు ఇలాంటివే అందుతున్నాయి. తమాషా ఏమంటే ఇందులో ఒకరి ఎస్ఎంఎస్‌లపై మరొకరు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేస్తున్నారు. అభ్యర్థులు పార్టీలకు అంటకుండా ఇతరుల ద్వారా పంపించి ఈ గండం గట్టెక్కవచ్చునని పార్టీలు భావిస్తున్నాయి. ఎందుకంటే ఎన్నికల సంఘం వాటిని కూడా అనుమతించదు. కర్ణాటకలో హోం మంత్రి ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా ప్రచారం చేసుకోవడానికి ప్రయత్నిస్తే ఎన్నికల సంఘం అనుమతి నిరాకరించి తీసేయించింది. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇలాంటి అనేక ఫిర్యాదులు వస్తున్నాయి.

అయితే ఇలాంటి ఆంక్షలు ఎన్నికల్లో ధన ప్రభావాన్ని అడ్డుకోవడం అనుమానమే. ఎందుకంటే మొత్తం వ్యవస్థ కార్పొరేట్ కాలుష్యంతో ప్రపంచీకరణ ప్రభావంతో నిండిపోయింది. ఆర్థిక సంక్షోభం తర్వాత ప్రభుత్వ వనరులను కొల్లగొట్టుకుతినడంపైనే బడా వాణిజ్య వేత్తల దృష్టి కేంద్రీకృతమైంది. కనక వారు ఏదో విధంగా ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేసి పగ్గాలు చేజిక్కుంచుకోవాలనుకుంటారు. రానున్న ఎన్నికల్లో దేశంలో పదివేల కోట్ల రూపాయలు ఖర్చయితే రాష్ట్రంలో నాలుగు వేల కోట్లు ఖర్చవుతాయంటున్నారు. పాత కొత్త పద్ధతులలో సారా ప్రవాహాల మొదలు సాంకేతిక సాధనాల వరకూ అన్ని ఈ యజ్ఞంలో పావులవుతాయి. వాటన్నిటి తాకిడి నుంచి ప్రజాస్వామ్యాన్ని ప్రజల స్వేచ్ఛాయుత ఓటింగును కాపాడుకోవడం పెద్ద పనే. ఆపైన మాఫియాలు సంఘ వ్యతిరేక శక్తుల పాత్ర వుండనే వుంటుంది. కొంత కాలం కిందట హైదరాబాదులోని ముషీరాబాద్ నియోజక వర్గంలో మంత్రి ముఖేష్ వియ్యంకుడి ఇంట్లో డబ్బు పంపిణీని సిపిఎం కార్యకర్తలు అక్కడికక్కడే పట్టుకున్నారు. ఆ సందర్భంగా సాక్షాత్తూ మంత్రిగారే ఎంపి మధుపై దౌర్జన్యానికి పాల్పడ్డారు.అయినా సరే దానిపై తదుపరి చర్య శూన్యం. కరీంనగర్ ఉప ఎన్నిక సందర్భంలో క్రికెట్ కిట్లతో కాంగ్రెస్ వాదులు దొరికి పోయిన సంగతి కూడా తెలిసిందే. కనక నిబంధనలు ఎన్ని వల్లె వేసినా వాటిని ఖచ్చితంగా అమలు చేయడం కీలకం. రాజకీయ కురుక్షేత్రంగా జరిగే 2009 ఎన్నికల్లో ఇలాంటి విషయాలపై అప్రమత్తంగా వుండటం అవసరం. కెజెరావు బృందం ప్రతిదీ తన దృష్టికి తెమ్మని కోరుతున్నది. ఎన్నికల సంఘం ఉచిత ఫోన్ నెంబర్లు కూడా ప్రకటించింది. కనక పౌరులు చైతన్యవంతులై వీటిని వినియోగించుకుంటే అక్రమార్కుల వికృతాలను అరికట్టవచ్చు. అప్పుడే ప్రజలు ఐచ్ఛికంగా ఓటేయగలుగుతారు.

★

వీడియో గేమ్‌లో ఎన్నికల ఆటలు

"ఎన్నికల సీజన్ కదా! ఇంక ఏ ఇద్దరు పెద్దవాళ్లు కూర్చున్నా...ఎన్నికల పొత్తులు, రాజకీయ ఎత్తుగడలు, కూటములు, ఓట్లు, సీట్లు, గెలుపు ఓటముల గురించిన చర్చలే జోరుగా నడుస్తుంటాయి. ఇళ్లల్లో పిల్లలకు మాత్రం ఇందులో పాల్గొనే అవకాశం పెద్దగా వుండదు" అని అనుకుంటుంటాం ఇప్పటి వరకు. అయితే తాజాగా '7 సీస్ టెక్నాలజీస్' అనే సంస్థ ఐదు వీడియో గేమ్స్‌ను ప్రవేశపెట్టింది. వీటిలో పిల్లలు (ఇష్టమైతే పెద్దలు కూడా) ఎంచక్కా తమకు నచ్చిన నాయకుణ్ణి గెలిపించొచ్చు. నచ్చని వారిని ఎన్నికల బరిలో మట్టి కరిపించొచ్చు. దేశంలోని ప్రధాన రాజకీయ నాయకులు ఇందులో కనిపిస్తారు. గేమ్ ఆడేవారు వీరిలో ఎవరినైనా ప్రధానమంత్రి కుర్చీలో కూర్చుండబెట్టవచ్చు. కాకపోతే జయాపజయాలేవీ నాయకుల చేతుల్లో వుండవు.



గెలుపుకోసం ఏమీ చేయలేరు. అదే బయటైతే బోలెడన్ని జిమ్మిక్కులు చేస్తారుకదా. వీడియో గేమ్ కాబట్టి ఆ పప్పులేం ఉడకవ్! ఔత్సాహికులెవరైనా తమకు ప్రీతిపాత్రమైన నాయకుణ్ణి ఎంచుకొని ఆట ప్రారంభించి అతన్ని గెలిపించాలి. మొదటి లెవల్ ఆటను విజయవంతంగా పూర్తి చేస్తే మిగతా రౌండ్లు ఆడే అవకాశం లభిస్తుంది. అక్కడే ఆటగాడి ఇష్టనాయకుడు సింహాసనం మీద ఆసీనుడై వుంటాడు. భారత ఎన్నికలు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్న ప్రస్తుత తరుణంలో కేవలం చిన్నారులనేకాక అన్ని వయసులవారిని ఆకట్టుకోవడానికి, అదే సమయంలో భారత రాజకీయ పరిస్థితిపై వారిలో చైతన్యం కలిగించడానికి ఈ వీడియోగేమ్స్‌ని ప్రవేశపెట్టామని 7 సీస్ మేనేజింగ్ డైరెక్టర్ అంటారు. మార్చి 15వతేదీనుంచి (ఇవాళ్టి నుంచే) ఈ ఆటలు www.onlinerealgames.com లో అందుబాటులోకి వస్తాయి.

సినిమా కబుర్లు

మోగిన పెళ్లి బాజాలు

బాలీవుడ్‌లో ఈ వేసవి సందర్భంగా పెళ్లి బాజాలు మోగాయి. ప్రముఖ తారలు ఆయేషాటకియా, అమృత అరోరా మనసుకు నచ్చినవారిని వివాహమాడి ఓ ఇంటి వారయ్యారు. 'సూపర్' హీరోయిన్‌గా తెలుగువారికి పరిచయమైన ఆయేషా టకియా తన బోయ్‌ఫ్రెండ్, రెస్టారెంట్ యజమాని అయిన ఫర్హాన్ అజ్మీని పెళ్లాడింది. ఈనెల ఒకటవ తేదీన ఫర్హాన్ రెస్టారెంట్‌లో మహ్మదీయ వివాహ పద్ధతిలో వీరి పెళ్లి జరిగింది. అయితే ఈ కార్యక్రమానికి బంధువులు, సన్నిహిత మిత్రులు మాత్రమే హాజరయ్యారు. ఆ మరుసటి రోజు ఇచ్చిన పార్టీకి బాలీవుడ్ ప్రముఖులు విచ్చేశారు. ఫర్హాన్ తండ్రి రాజకీయనాయకుడు కావడంతో అటువైపు నుంచి కూడా విందుకు హాజరయ్యారు. ఇక అమృతా అరోరా వివాహం మార్చి 4వ తేదీన షకీల్ లడక్‌తో జరిగింది. బాంద్రాలోని ఓ చర్చిలో కాథలిక్ వివాహ పద్ధతిలో వీరి వివాహమైంది. నూతన వధూవరులు ఆ మరుసటి రోజున మాంచి పార్టీ ఇచ్చారు. దీనికి బాలీవుడ్ జనాలు సగం మంది హాజరయ్యారని వినికిడి.

మాజీ ప్రపంచ సుందరి, బాలీవుడ్ కథానాయకి ప్రియాంక చోప్రా చిత్రాలు గత సంవత్సరం చాలానే విడుదలయ్యాయి. అందులో కొన్ని హిట్టవగా... కొన్ని ఫట్టయ్యాయి. అయితే ఈ ఏడాది మరిన్ని హిట్లు సాధించగలనన్న ధీమా మాత్రం ఆమె వ్యక్తం చేస్తోంది.

కమల్ కంటే రెండాకులు ఎక్కువే

తాజాగా అశుతోష్ గోవార్కర్ రూపొందిస్తున్న 'వాట్ ఈజ్ యువర్ రాశి' చిత్రంలో ప్రియాంక నటిస్తోంది. అయితే కమల్ హాసన్ కంటే రెండు ఆకులు ఎక్కువే అన్నట్టుంది ప్రియాంక పరిస్థితి. కమల్ దశావతారంలో పది విభిన్నపాత్రల్లో కనిపించి ప్రేక్షకుల మతి పోగొడితే...ప్రియాంక ఏకంగా 12 పాత్రలు చేయబోతోంది తన తాజా చిత్రంలో. ఈమధ్యే రాజూఖాన్ కొరియోగ్రఫీ అందించిన ఓ పాటలో కూడా పాల్గొంది. ఇందులో ప్రియాంక వేసిన 12 పాత్రలూ వుండడం విశేషం. హర్మన్ బవేజా కూడా ఈ చిత్రంలో నటిస్తున్నాడు.

ఎన్నికల బరిలో బాలీవుడ్ తారలు

పోయినసారి ఎన్నికల్లో బాలీవుడ్ తారలు బాగానే ఓట్లు దండుకున్నారు. సీట్లు కూడా సంపాదించుకున్నారు. శతృఘ్నసిన్హా, ధర్మేంద్ర, వినోద్ ఖన్నా, జయప్రద, గోవిందా, రాజ్‌బబ్బర్ రాజకీయాలలో చేరి ప్రముఖ పార్టీల తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో కొందరు గెలుపొందారుకూడా. అమితాబ్ బచ్చన్, జయాబచ్చన్, హేమమాలిని వంటి సీనియర్ నటులు కొన్ని పార్టీలకు, నాయకులకు తమ మద్దతు తెలియచేశారు. తాజా ఎన్నికలలో సంజయ్‌దత్ సమాజ్‌వాది పార్టీ తరపున లక్నో నియోజకవర్గం నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. నగ్మా, పరేష్‌రావల్, మనోజ్ తివారి కూడా వివిధ స్థానాలనుంచి పోటీ చేయనున్నారు. 90లలో దక్షిణాది కథానాయికగా బిజీగా వున్న నగ్మా ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ సంపాదించి ఎన్నికలలో పాల్గొనాలని చూస్తోంది. ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్ నుంచి ఎన్నికలలో పోటీ చేసేందుకు భోజ్‌పురి గాయకుడు మనోజ్ తివారికి కాంగ్రెస్ టికెట్ లభించింది. హిందీ చిత్ర నిర్మాత ప్రకాష్ ఝా 'భెట్టియా' స్థానం నుంచి రామ్ విలాస్ పాశ్వాన్ పార్టీ తరపున నిలబడనున్నారు. అజయ్‌దేవగన్, కాజోల్, కత్రీనా కైఫ్ ఆయనకు ప్రచారం చేయనున్నారు. అయితే అమితాబ్ బచ్చన్ మాత్రం ఈసారి తాను ఏపార్టీ తరపున ప్రచారం చేయబోనని ముందుగానే ప్రకటించేశాడు. షారుక్‌ఖాన్ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం చేస్తాడని మొదట వినిపించినా అదేంలేదని కాంగ్రెస్ వారు అంటున్నారు. ★

బాండ్ చిత్రానికి రెహమాన్ సంగీతం



భారతదేశం గర్వించదగ్గ సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ తాజాగా జేమ్స్‌బాండ్ చిత్రానికి సంగీతం అందించనున్నారు. డేనీ బోయెల్ దర్శకత్వం వహించనున్న జేమ్స్ బాండ్ 23వ చిత్రాన్ని బార్బారా బ్రోకోలి నిర్మించనున్నారు. ఉత్తమ దర్శకుడిగా డేనీ, ఉత్తమ సంగీతకర్తగా, గాయకుడిగా ఎ.ఆర్ రెహమాన్ ఈ ఏడాది ఆస్కార్ అవార్డులను అందుకున్న సంగతి తెలిసిందేకదా.


ఏంచేద్దాం కాలాన్ని బట్టి మనము మారాలి శాస్త్రీ...!!
ఇచ్చట మీ జాతకాన్ని కంప్యూటర్‌లో పరీక్షించి, మీ జీవితాన్ని 3D యానిమేషన్‌లో డిజైన్ చేసి మీ వెబ్‌సైట్‌కు పంపగలం సంప్రదించవలసిన చిరునామ WWW. SASTRY.....
వి.రామకృష్ణ


ఎన్నికల్లో అవసరమైతే ఒంటరిగా అయినా పోరాడాలని వాళ్ళ నాయకుడు చెప్పారట అందుకే అలా...!!
వి.రామకృష్ణ

ఆ మహేష్ నా ప్రేమకి ఓకే చెప్పాడే బామ్మా! కాకపోతే నా నడుంకి వడ్డాణం చేయిస్తేగాని పెళ్లి చేసుకోడట!
బి.పురుషోత్తం


నీదంతా వట్టి మట్టి బుర్ర అంటోంది మా ఆవిడ... మరి నిజంగా మట్టి ఉందో లేదో చెప్పేయండి డాక్టర్!
బి.పురుషోత్తం

యువరానర్! నా క్లైయింట్ ఆ అమ్మాయి ప్రేమను అంగీకరించకపోవడానికి గల కారణం యాసిడ్ కంపెనీకి యజమాని నన్న భయంతోనే...!
బి.పురుషోత్తం


మంచి సంబంధం.. అబ్బాయిది ఫారెన్ ఉద్యోగం అన్నావ్... ఇప్పుడు చూడు.. అల్లుడి ఉద్యోగం ఊడింది -.. అమ్మాయి కాపురం ఏంకాను...!!
ఏ.వి. శాస్త్రి సిద్ధాంతి
అమెరికాలో రెండు లక్షల ఉద్యోగాలకు కోత - వార్త
వి.రామకృష్ణ


మనుషులకే గ్యారెంటీ లేదు! ఇక తినే ఆహార పదార్థాలు మంచి ఆరోగ్యానిస్తాయని ఎలా చెప్పమంటారు సార్!
హోటల్ 'యమ'
బి.పురుషోత్తం


అబ్బే. నడుం నొప్పి కాదండి... ఇంట్లోకి కడవలతో నీళ్లు తెచ్చి తెచ్చి... ఇలాగై పోయింది!
డాక్టర్...
గ్రామాల్లో తాగునీటి కటకట
బి.పురుషోత్తం

తెలుసుకుందామా...

అద్భుతం... అద్వితీయం

రసాత్మకమైన చిత్తోడ్‌ఘఢ్ చరిత్ర రేఖామాత్రంగానైనా తెలియకుండా...అక్కడి శిధిలాలను, అవిచెప్పే కథలనూ అవగతం చేసుకోలేము. అందుకే గతవారం పూర్తిగా చరిత్ర గురించే చెప్పుకున్నాం. మరి ఈ సంచికలో అక్కడి కట్టడాలు, వాటి ప్రాధాన్యత, ప్రత్యేకతల గురించి ముచ్చటించుకుందాం...

చిత్తోఢ్‌ఘఢ్ దుర్గపు విశేషాలను పరిశీలిద్దాము. 500 అడుగుల ఎత్తున్న పర్వతంమీద నిర్మించిన ఈ కోట ఉత్తర దక్షిణ దిక్కులుగా విస్తరించి 13 కిలోమీటర్ల పరిధిలో, విస్తారమైన నిర్మాణాలతో దర్శనమిస్తుంది. కోటలోనికి వంకరలు తిరుగుతూ సాగిపోయే ఈ దారిగుండా ఒక మైలుదూరం వెళ్లాలి. ఈ దారి 7 ద్వారాలగుండా సాగుతుంది. మొదటిది పర్వతపాదాన వున్న పదన్‌పోల్. రెండవది బైరాన్‌పోల్. ఇది చిత్తూరు రెండవ ముట్టడిలో మరణించిన యోధుడు, సోలంకి బైరాన్‌దాస్‌కు స్మృతిచిహ్నం. ఇక్కడే నాలుగు స్ధంబాలమీద నిర్మించిన మంటపం, కల్లా అనే వీరుని స్మారక చిహ్నం. మరొకటి ఆరు స్ధంబాలమీద మంటపం జైమాల్‌కు స్మారక మందిరం. అక్బరు ముట్టడిలో వీరిద్దరూ ఇక్కడ నేలకొరిగారు. మూడవది హనుమాన్‌పోల్, ఇక్కడే రజ్ఞానాసజ్జా, రజ్ఞానాసిన్హా చిత్తూరు రెండవ ముట్టడిలో ప్రాణాలర్పించారు. తరువాత గణేష్‌పోల్, జొర్లాపోల్, లక్ష్మణ్‌పోల్ వున్నాయి. ఇవన్నీదాటి చక్కని శిల్పతోరణం, దానిమీద వివిధ దేవతామూర్తులను మలచి వుంటుంది. దీనికి తూర్పుగా చందావల్ పట్టా స్మారక చిహ్నమున్నది. అక్బర్ దాడిలో ముఖ్యులంతా మరణించిన తరువాత యుద్ధబార మంతా పట్టామీద పడ్డది. అప్పటికి అతని వయస్సు 16 సంవత్సరాల మాత్రమే అయినా అతడి భార్యకు కూడా శూలాన్ని చేతికిచ్చి దుర్గ రక్షణకు నియమించి పంపిందట. అతడు యుద్ధభూమిలో ప్రాణాలర్పించాడు. ఈ యుద్ధంలో అనన్యసాహసంతో పోరాడిన ఇద్దరు వీరుల శౌర్యప్రతాపాలను ప్రశంసించకుండా వుండలేక పోయాడు. అక్బర్. అతడూ వీరుడేగా మరి! వీరే జైమాల్, పట్టా. వీరి విగ్రహాలను తయారుచేయించి అక్బర్ తన ఢిల్లీ కోటలో ప్రతిష్టించాడట. శత్రువు మనస్సును సైతం దోచుకున్న వీరి ధైర్యసాహసాలు ఎంతటివో!

ఇక్కడినుండి ముందుకుసాగితే మొదట తుల్జాభవాని మందిరమున్నది. దీనిని బన్‌బీర్ నిర్మించాడట.

నవలఖభండార్

ఇది మేవారు రాజ్యపు ధనాగారం. ఆనాడిక్కడ 9లక్షల నాణేలుండేవట. ఇక్కడొక గోడ వుంది. చాలా భాగం శిధిలమైపోయింది. ఇది బన్‌బీర్ తన రక్షణకొరకు దుర్భేద్యమైన కట్టడంలో భాగంగా ప్రారంభించాడట. కానీ ఇది పూర్తికాకముందే చిత్తూరు ఉదయసింగుకు స్వాధీనమైనది.

శృంగార్ చావడి

ఈ శిధిలప్రాకారపు దాపునే శృంగార్‌చావడి వుంది. ఇది జైనమందిరం. అతిసున్నితమైన శిల్పసంపదతో అలరారుతుంటుంది. లోపల ఒక ఎత్తైన పీఠము. దీనికి నాలుగు వైపులా శిల్పసంపద విరబూసిన స్ధంబాలు. వీటిని కలుపుతూ నాలుగు పాలరాతిదూలాలు. ఈ వేదికమీధ జైనుల 16వ తీర్ధంకరుడు శాంతినాథుని విగ్రహాన్ని ప్రతిష్టించారు. దీనిబయటి గోడలమీద, అనేక దేవతామూర్తులు, నాట్యకత్తెలు, జంతువులు వంటి శిల్పాలు మనోహరంగా మలచారు.

తోప్‌ఖానా

కోటలో లభించిన ఫిరంగులన్నీ ఇక్కడ భద్ర పరచారు. ఒక్కడున్న అతిపెద్ద ఫిరంగి 14 అడుగుల పొడవు, 7 అంగుళాల నోటితో ఆశ్చర్యకరంగా వుంటుంది. ఇది యుద్ధాలలో ఎన్ని అగ్నిగోళాలను వర్షించిందో!

మ్యూజియం

తోప్‌ఖానాకు పక్కనే పురాతత్వ శాఖవారి మ్యూజియం వుంది. ఇక్కడ శిధిలాలలో లభించిన వస్తువులను ప్రదర్శించారు. దీనిముందున్న చెట్టుకింద ప్రదర్శించిన బౌద్ధస్థూపాలను చూసితీరాలి. రాతిలోమలచిన ఈ చిన్నచిన్న స్థూపాలు, జైమల్ తటాకం వద్ద లభించాయట.

కుంభరాజ గృహము

రాజపుత్రశిల్పిరీతిలో రాణాకుంభా పునరుద్ధరించిన విస్తారమైన రాజమందిరమిది. దీని కిందిభాగాన చాలాపెద్ద భూగృహం వుంది. యుద్ధరంగంలో పరాజయం తప్పదనుకున్నపుడు, రాజపుత్రస్త్రీలు శత్రువుల బారినపడి తమ దేహాలు అపవిత్రం కాకుండా ఆత్మార్పణ చేసుకునే ప్రదేశం. రాణిపద్మిని ఇక్కడే ఆత్మార్పణ చేసుకున్నది. జౌహార్ అనే ఈ ఆహుతి గురించి కల్నల్ టోడ్ ఇలా అంటాడు. "ఈ పాతాళ గృహంలో చితులు వెలిగించారు.

అగ్నికీలలు ఎగిసిపడుతున్నా, బయటి ప్రపంచానికి కానరావు. చిత్తూరు రక్షణ బాధ్యతలు తీసుకున్న వీరులందరూ ఊరేగింపుగా బయలుదేరారు. మహారాజుల భార్యలు, మిగిలిన రాజపుత్రుల భార్యలూ, కుమార్తెలూ వీరంతా వేలసంఖ్యలో పయనమైనారు. రాణిపద్మిని తోసహ ఈమండుతున్న భూగృహంలోనికి ప్రవేశించారు. వెంటనే దీనికున్న తలుపులు మూయబడ్డాయి. రానున్న అవమానాల నుంచి రక్షించి, అగ్ని వీరిని సురక్షితమైన వేరే లోకాలకు తీసుకుపోయింది". ఎందుకో ఇక్కడ భూగృహం వంక చూస్తూ నిలబడిపోయాను. చరిత్రకందినంతవరకూ ముమ్మారు ఇక్కడ వేలాదిమంది స్త్రీలు అగ్నికీలలో భస్మరాశులుగా మారిపోయారు. వారి పవిత్రత, స్వాతంత్ర్యపిపాస అంతటివి. 500 ఏళ్ళనాటి వారి ఆత్మార్పణకు కళ్ళు చెమర్చాయి. మానవునిది ఎంతటి ఔన్నత్యం. అందులోనే ఎంతటి విషాదం. నశ్వరమైనదే దేహం. కానీ దాన్నిలా తృణప్రాయంగా త్యజించటానికి ఎంతటి మనోబలం కావాలి. ఈ రాజప్రాసాదంలోనే మీరాబాయి నివశించేదట. తీవ్ర మధురభక్తితో భగవంతుని పాదాలను చేరుకున్న మహాభక్తురాలు. ఈ గాథ తరువాత చూద్దాము.

సాత్‌బీస్ దేవర

కుంభాపాలెస్‌కు తూర్పుగా చాలాపెద్ద జైనమందిరం వున్నది. ఇక్కడ 27 జైన పీఠాలున్నాయి. దీనికద్దిన శిల్పకళాచాతుర్యం ఒక అద్భుతమే. ఇది మౌంట్‌అబూలో వున్న దిల్వార మందిరాల వలె వుంటుంది. 11వ శతాబ్దపు ఈ ఆలయాన్ని ఇటీవలె పునరుద్ధరించారు. ఇది శ్వేతాంబర జైనుల ఆరాధనామందిరం.

కుంభధ్యాన మందిరం

శ్రీ మహావిష్ణువు యొక్క వరాహావతారానికి నిర్మించిన మందిరమిది. 9వ శతాబ్దపు మందిర పునాదుల మీద 1499లో రాణాకుంభ నిర్మించిన మంటపంపై, గరుడ విగ్రహం (శ్రీ మహావిష్ణువు వాహనం) ఎదురుగా ఆకాశం లోనికి చొచ్చుకుపోతున్నట్లున్న మందిర శిఖరం. దానిముందు చిన్నచిన్న శిఖరాల సమాహారంతో ముఖమంటపం. ఈ సువిశాల మందిరానికి దక్షిణం వైపునున్న చిన్నమందిరం, మీరాబాయి భక్తిపరిమళంతో పునీతమైనది. ఇది మీరాబాయి, తన గురువైన రామదాసుకు స్మృతిచిహ్నంగా నిర్మించినదంటారు. గాని, ఇది రాణాకుంభ నిర్మించినదే తరువాత కాలంలో ఇది మీరాబాయి మందిరంగా ప్రసిద్ధికెక్కింది. లోపల మురళీధరుని విగ్రహం, కృష్ణభక్తిలో మునిగిపోయినట్లున్న మీరాబాయి తైలవర్ణం చిత్రం, మందిరానికెదురుగా చిన్నమంటపంతో రామదాసు పాదముద్రికలున్నాయి.

విజయస్తంభము

ఇది మాళ్వాకు చెందిన మహమ్మద్ ఖిల్జీమీద విజయానికి చిహ్నంగా 1448 ఎడిలో నిర్మించారు. దీని నిర్మాణశైలి అద్భుతం. ఈనాటికీ విజయపతాకం వలె నిలబడి వుంది. 122 అడుగుల ఎత్తున్న ఈ చతురస్రాకారపు స్తంభం, 9 అంతస్థులతో పైవరకూ మెట్లతో వుంది. 8,9 అంతస్థులు గోడలు లేకుండా స్థంభాల మీద నిలబడివున్నాయి. ఇక్కడ వివిధ దేవతా మూర్తులూ, పురాణగాధలూ మలచారు. వీటిలో లక్ష్మీనారాయణుడు, అర్ధనారీశ్వరుల విగ్రహాలు చాలా బాగుంటాయి. దీని నిర్మాణానికి 8సంవత్సరాలు పట్టిందట. లోపలినుంచి పైకెక్కుతుంటే, ఒక్కోమెట్టూ ఒక అడుగు ఎత్తున్నది. మొత్తం 157 మెట్లున్నాయట. పైఅంతస్థులో వీస్తున్న చల్లగాలి పడ్డ శ్రమనంతా మరపిస్తుంది. ఇక్కడనుంచి చూస్తే కొండమీద పరచుకున్న చిత్తూరుదుర్గం అద్భుతమైన దృశ్యం - ఢిల్లీలోని కుతుబ్‌మినార్, దౌలతాబాద్ ఖిల్లాలోని విజయస్థంభం కూడా ఇలాంటివేకాని దీని నిర్మాణం విలక్షణంగా వుంటుంది.

సిద్ధేశ్వర మహాదేవ మందిరం

దగ్గరలోనే వున్న బహుపురాతన మందిరమిది. గర్భగుడిలో శివుని మూడు ముఖాలతో మలచారు. ఇవి సరళ, సౌమ్య, రుద్రభావ మూర్తులు. ఇవి సత్వరజస్తమోగుణాలకు, సంకేతమంటారు. 11వ శతాబ్దంనాటి ఈ మందిరం



విజయస్థంభము





రాణి పద్మిని మహల్





భోజరాజు త్రిభువన నారాయణునికి నిర్మిస్తే, తరువాత జైనమందిరంగానూ ఆ తరువాత సిద్ధేశ్వర మహాదేవ మందిరంగానూ మారిందని అంటారు.

కాళీమందిరం

ఈమె రాజవంశపు కులదేవత. 8వ ప్రదక్షిణమార్గంలోనూ అద్భుతమైన శిల్పాలు కనువిందు చేస్తాయి. మొదట ఇది సూర్యభగవానుని ఆలయమంటారు. ఈనాటికీ గర్భగుడిలో సూర్యభగవానుని విగ్రహం కూడా వుంది. ఇది ప్రతీహారుల శిల్పరీతికి మచ్చుతునక.

పద్మినిపాలెస్

కాళిమందిరానికి దక్షిణంగా పెద్ద తటాకం. దాని గట్టున రాణిపద్మిని నివాసగృహం ఇది. ఈ తటాకం మధ్యలో మరో సౌధం వుంది. దీనివద్దకామె విహారార్థం వచ్చేదట. ఈ పద్మిని పాలెస్‌లోనే అల్లావుద్దీన్ ఖిల్జీ, పద్మిని ప్రతిబింబాన్ని అద్దంలో చూశాడట. అదేస్థానంలో ఒక అద్దం ఇప్పటికీ అమర్చివుంది. మరోవాదన, రాణిపద్మిని ఇక్కడకు విహారార్థం మాత్రమే వచ్చేదనీ, ఆమె నివాసం కుంభరాజ ప్రాసాదంలోనేనని. రాజవంశీకుల నివాసం కుంభరాజ ప్రాసాదం. ఆమె ఆత్మార్పణ కూడా అక్కడే జరిగింది. కనుక దీనినే మనం విశ్వసించవచ్చు. ఇక్కడ ఒక్కవిషయం పదేపదే స్ఫురణకు వస్తుంది. రాణిపద్మిని దేహసౌందర్యం ఆమెకు పుట్టుకతో లభించిన వరం. ఆమె కోసం చిత్తూరుకోటను ముట్టడించాడు ఖిల్జీ. వేలాదిమంది ప్రాణాలర్పించారు. మహావైభవోపేతమైన ఒక రాజ్యం కూలి పోయింది. రాజపుత్రుల ఆత్మగౌరవానికి బాహ్యసౌందర్యం తల వంచింది. అంతటి సౌందర్యరాశి నిర్వికారంగా, తన శరీరాన్ని అగ్నికి ఆహుతిచ్చి బూడిదరాశిగా మారింది. సౌందర్యమనేది వరమేకాదు, ఒక్కోసందర్భంలో శాపంకూడానేమో!

కీర్తిస్తంభం

జైనమతస్థుడు, వ్యాపారి అయిన జీజా 12వ శతాబ్దంలో జైనతీర్థంకరుడు ఆదానాథునకు నిర్మించినదీ కీర్తిస్తంభం. ఇది 75 అడుగుల ఎత్తున నాలుగు అంతస్తులతో నిర్మించారు. పైకి మెట్లు నాలుగువైపులా చాలాపెద్ద ఆదినాథుని విగ్రహాలున్నాయి. మిగిలినభాగమంతా వివిధ శిల్పాలు-దిగంబర తీర్థంకరుల శిల్పాలున్నాయి. దీనికి పక్కనే 15వ శతాబ్దంలో పునర్నిర్మించిన మహావీరుని మందిరమున్నది.

చతుర్భుజాజి మందిరం

ఇది శ్రీమహావిష్ణువుకు నిర్మించిన అందమైన మందిరం. కింద నేలమీద పురాతన వెండినాణేలు చాలా అమర్చారు. ఇప్పటికీ ఎంతో పరిశుభ్రంగా వుంచి కాపాడుతున్నారు. ఇక్కడ పడమటిభాగాన, షుమారు 500 గృహాలలో ప్రజలు ఇప్పటికీ నివాసముంటున్నారు. పిల్లలకు స్కూలు, ఒక ఆయుర్వేద వైద్యశాల కూడా వున్నాయి. ఇక్కడనుంచి చూస్తే నాలుగైదు ఆలయాలు, అన్నపూర్ణ, బాణమాత, సాస్‌బహూ, శ్వేతాంబర జైనమందిరాలు కనిపిస్తాయి.

రతన్‌సింగ్ మహల్

ఈ జనావాసానికి ఉత్తరంగా, రతన్‌సింగ్ మహల్ శిథిలాలున్నాయి. రాణా ఉదయసింగ్ మేనమామ బుండి రతన్‌సింగ్, ఇక్కడ నివసించేవాడట. ఇక్కడొక శివాలయమున్నది. దీనిని రత్నేశ్వర మహాదేవ మందిరం అంటారు. దీనికెదురుగానున్న తటాకాన్ని రత్నేశ్వర తటాకం అంటారు. బహుశా వీటిని రతన్‌సింగ్ భగవదారాధనకు ఉపయోగించేవాడేమో!

మీరాబాయి

చితోఢ్‌ఘఢ్ కథనం ముగించేముందు మీరా భాయిని స్మరించకుండా వుండలేము. ఎందుకంటే, పరాప్రేమతో ఆధ్యాత్మిక శిఖరాలనందుకున్న పావనచరిత. మహాభక్తురాలు.

ఈ దుర్గంలో శిథిలాలు విస్తారంగా పరచుకుని కనిపిస్తాయి. విలాసవైభవాల సుఖజీవనం, శౌర్యపరాక్రమాల పరాకాష్ట, వేలాది వీరులు తమ రక్తం చిందించి, స్వతంత్రజీవనం కొరకు జరిపిన పోరాటపటిమ, శత్రువులచేతిలో అవమానాలకు తావీయక ఆత్మార్పణకు వెనుదీయని సాహస నారీజనం, ఇలా చిత్తూరు దుర్గంలో ప్రతి రాయి, చీకటి వెలుగుల విన్యాసంతో మన కనులముందు ఆవిష్కృతమౌతుంది. అద్వితీయమైన ప్రదేశం. అద్వితీయమైన చరిత్ర. అద్వితీయమైన అనుభవం చిత్తూరు సందర్శనం.

★

విజ్ఞాన వీచిక



కార్బన్ అకౌంటెంట్లు

- డా॥కాకర్లమూడి విజయ్

హరితగృహ వాయువులు (గ్రీన్‌హౌజ్ గ్యాస్) వాతావరణంలో ఉష్ణోగ్రత అధికం చేస్తూ, రానున్నకాలంలో పెను మార్పులకు కారణం అవనున్నాయని సర్వత్రా వ్యక్తమవుతున్న అభిప్రాయం. అటువంటి వాయువులలో అధిక ప్రాముఖ్యత పొందింది కార్బన్‌డయాక్సైడ్. ఈ వాయువు గురించి రెండు విశేషాలున్నాయి. ఒకటి- జీవులన్నీ ఈ వాయువుని శ్వాసక్రియ ద్వారా శరీరాల నుండి విడుదల చేస్తాయి. రెండు- మొక్కలు, చెట్లు మాత్రం శ్వాసించేటప్పుడు కార్బన్‌డయాక్సైడ్‌ని విడుదల చేస్తూనే ఆహారాన్ని తయారు చేసుకుని, ఎండ వేళల్లో మాత్రం ఈ వాయువుని తిరిగి పీల్చుకుంటాయి.

జీవులు మాత్రమే కాక మానవ నిర్మిత యంత్రాలు, మానవ చర్యలు కూడా కార్బన్‌ని అధికమోతాదులో వాతావరణంలోకి విడుదల చేస్తున్నాయన్నది జగమెరిగిన సత్యమే. అయితే ఏ ప్రాంతం నుండి హరితగృహ వాయువులు అధిక మోతాదులో విడుదలౌతున్నాయో తెలుసుకునే ప్రయత్నంలో శాస్త్రం ముందడుగు వేసింది.

గత నెలలో జాక్సా అనే జపనీస్ అంతరిక్ష సంస్థ, 'ఇబుకీ' అనే ఉపగ్రహాన్ని ప్రయోగించింది. ఈ ఉపగ్రహం బాధ్యత అంతరిక్షం నుండి భూగ్రహంపై ఎక్కడెక్కడ అధికంగా కార్బన్‌డయాక్సైడ్, మిథేన్ వాయువులు వెలువడుతున్నాయో పసిగట్టడం. ఈ తరహా ఉపగ్రహాల్లో ఇబుకీనే మొట్టమొదటిది.

అదే తరహాలో అమెరికాలోని నాసా కూడా 'ఆర్బిటింగ్ కార్బన్ అబ్జర్వేటరీ' ఉపగ్రహాన్ని ఫిబ్రవరిలో ప్రయోగించింది. ఇది మూడు స్పెక్ట్రోమీటర్లు కలిగి వుంటుంది. ప్రతి 16 రోజులకొకసారి వాయువుల సాంద్రత తెలియపరుస్తుంది.

ఓ.సి.ఓ భూమికి 705 కిలోమీటర్ల సగటు ఎత్తులో ప్రయాణిస్తుంది. ప్రతి 99 నిమిషాలకి ఒక ప్రదక్షిణ పూర్తి చేస్తుంది. అయితే అది సముద్రంలో కూలిపోయింది.

ఇబుకీ ఇంటే జపనీస్ భాషలో శ్వాస అని అర్థం. భూగ్రహం ఏ విధంగా శ్వాసిస్తుందో తెలుసుకోవడానికి ఆ ఉపగ్రహం భూమికి 667 కిమీ సగటు ఎత్తులో 100 నిముషాలకోసారి ప్రదక్షిణం చేస్తూ, రెండు డిటెక్టర్లతో భూమ్మీది 56,000 ప్రదేశాల నుండి వాయువుల విడుదల సమాచారాన్ని సేకరిస్తుంది. ఒక డిటెక్టరు స్పెక్ట్రోమీటరు. దాని సాయంతో భూమి నుండి పరావర్తనం చెందే సూర్యరశ్మిని కొలుస్తారు. కార్బన్‌డయాక్సైడ్, మిథేన్ వాయువులు రెండూ సూర్యరశ్మిని పీల్చుకుంటాయి. ఆ మాటకొస్తే రకరకాల వాయువులు రకరకాల రంగుల కాంతిని పీల్చుకుంటాయి. వాటి ఆధారంగా ఏ ప్రాంతంలో కార్బన్‌డయాక్సైడ్, మిథేన్‌లు ఎక్కువ వున్నాయో కనిపెట్టవచ్చు.

ప్రస్తుతం సుమారు 250 ప్రదేశాల నుండి కార్బన్‌డయాక్సైడ్ మోతాదుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇకపై వేలాది ఇతర ప్రదేశాల సమాచారమూ తోడైతే సంక్లిష్టమైన కార్బన్ చక్రంపై మరింత అవగాహన ఏర్పడే అవకాశముంది. ఒక భారీ పరిశ్రమ (విద్యుత్ ఉత్పాదక కేంద్రాల వంటివి) విడుదల చేసే కార్బన్‌డయాక్సైడ్ వివరాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నా, అనూహ్యంగా ఏర్పడే బడబాగ్ని వల్ల వచ్చే కార్బన్‌డయాక్సైడ్ గానీ లేదా అమెజాన్ వంటి మహారణ్యాలు పీల్చుకునే కార్బన్‌డయాక్సైడ్ మోతాదు గానీ స్పష్టంగా తెలియడం లేదు. ఈ కొత్త ఉపగ్రహాలతో అటువంటి కీలక వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది.

ప్రస్తుతం దాదాపు 330 బిలియన్ టన్నుల కార్బన్‌డయాక్సైడ్ ఏటా భూమ్మీద ఉత్పత్తి అవుతోందని అంచనా. అందులో సగం సముద్రాలు పీల్చుకుంటాయి. భూమికూడా కొంత పీల్చుకుంటుందని తెలుసు కానీ, అది ఎక్కడ? ఎంత? అనే వివరాలు ఇప్పటి వరకూ తెలియలేదు. అందుకు కారణం ప్రయోగాలకు అనువుగా లేని మహారణ్యాలు. ఉపగ్రహాల వల్ల ఆ సమస్య తీరుతుంది.

పారిశ్రామిక విప్లవం తదుపరి 'అభివృద్ధి' కారణంగా 280 పిపిఎమ్ ఉన్న కార్బన్‌డయాక్సైడ్ మోతాదు 370 పిపిఎమ్ వరకూ పెరిగింది. ఇందులో మానవుల కారణంగా ఏటా దాదాపు 7-8 బిలియన్ టన్నుల కార్బన్‌డయాక్సైడ్ విడుదలౌతోందని అంచనా. కానీ కచ్చితమైన లెక్కలు ఇంకా లేవు. ఈ మోతాదు భూమ్మీది మహా కార్బన్ చక్రంలో చాలా చిన్నదే అయినా, ఇప్పటికే కీలక స్థాయిలో పెరిగిన వాయువులకు ఈ మాత్రం మోతాదే పెను దుష్పరిణామాలకు కారణం కావచ్చు.

ప్రస్తుతం అంతరిక్షంలోని రెండు కొత్త 'పక్షులు' మానవ కారణ కార్బన్‌డయాక్సైడ్‌నే కాక మొత్తం హరితగృహ వాయువుల 'అకౌంట్ల'ను తేటతెల్లం చేయనున్నాయి. ★

ముదురు

బాధపడకేం, నేనున్నాగా నీకు తోడుగా



వీరి వీరి గుమ్మడి పండు

జవాబు

వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరు అరాఫత్



కొత్త పుస్తకాలు

నాటకప్రియులకు కానుక

తెలుగు నాటకానికి విశిష్ట స్థానం ఉంది. పూర్వం పద్య నాటకాలు, గ్రాంధిక గద్యనాటకాలు విరివిగా వచ్చి అందరినీ అలరించాయి. కన్యాశుల్కం నాటకంతో తెలుగు రంగస్థలం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. నూరేళ్ల దాటిన 'కన్యాశుల్కం' ప్రదర్శన పరంగా, ప్రయోజన పరంగా, సాంకేతిక పరంగా ప్రేక్షకుల అభిమానాన్ని విశేషంగా చూరగొన్నది. తర్వాత వచ్చిన నాటకాలు కూడా తీసివేయవలసినవి కావు. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకుని గంగప్ప నూట నలభై సంవత్సరాల తెలుగు నాటకరంగ స్థితిగతులను కళ్లకు కట్టినట్టు విశదీకరించారు.

ఈ గ్రంథకర్త మూడేళ్ళ శ్రమపడి రచించి, ముద్రణ విషయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని ఈ పుస్తకాన్ని వెలువరించారు. అయితే "తెలుగు నాటకం - సామాజిక చైతన్యం" అనే ఈ పుస్తకం చదివిన వారందరూ గ్రంథకర్త ఆలోచనల్ని తప్పకుండా అభినందిస్తారు. ఎందుకంటే తెలుగు నాటకంలో పేరెన్నికగన్న నాటకాల స్థితిగతులను కూలంకషంగా చర్చించారు.

పదకొండు ప్రకరణాలుగా విభజించి రాసిన ఈ పుస్తకంలో నాటకాభిమానులకు, రచయితలకు, ప్రయోక్తలకు, దర్శకులకు, ప్రదర్శకులకు, పోటీలు నిర్వహించే పరిషత్తులకు ఎంతో విలువైన సమాచారం ఇవ్వబడింది. తెలుగు నాటక రంగం వెనుకబడిపోతోందని వాపోయేవారు ఇది చదివితే ఆశల జల్లుల్లో మునిగి తేలుతారు.

తెలుగు నాటక రంగంలో అత్యంత ప్రజాదరణ చూరగొన్న, సంస్కరణవాద నాటకంగా మలచబడిన కన్యాశుల్కం నాటకం దగ్గరనుంచి తెలుగు రంగ స్థలంపై ప్రదర్శన పరంగా ఆధునిక పద్ధతులు మొదలయ్యాయని తెలియజేస్తున్నారు. తర్వాత కాలంలో వచ్చిన దేశభక్తి నాటకాలు, హేతువాద నాటకాలు, అస్పృశ్యతా నిర్మూలనాత్మక నాటకాలు, రైతు సమస్యాత్మక నాటకాలు, మహిళాభ్యుదయ నాటకాల గురించి సోదాహరణంగా వివరించారు. అంతేకాదు పాటిబండ్ల ఆనందరావు, ఎం. సంజీవి, డి. విజయభాస్కర్, దివాకర్ బాబు, వి. భాస్కరచంద్ర, ఆకెళ్ళ, కావూరి సత్యనారాయణ, కందిమళ్ల సాంబశివరావు, వల్లూరి శివప్రసాద్, వి.ఎస్.కామేశ్వరరావు, యం.జయప్రకాష్, వాగ్దేవి, డి.వి. రమణమూర్తి, కె.చిరంజీవి, వల్లేటి లక్ష్మీ కాంతశేఖర్ లాంటి ఆధునిక నాటక రచయితల కృషిని పరామర్శించారు.

ఈ పుస్తకం ఆసాంతం చదివిన వారికి తెలుగు నాటకరంగంపై మక్కువ పెరుగుతుంది. నేడు అనేక పరిషత్తులు నిర్వహిస్తున్న నాటక పోటీల ద్వారా ప్రేక్షకాభిమానం చూరగొందుతున్న నాటకంపై ఆశాభావం కలుగుతుంది. అందుకే ఇది నాటక ప్రియులందరూ చదవదగ్గ పుస్తకమని చెప్పక తప్పదు.

తెలుగు నాటకం - సామాజిక చైతన్యం (1860- 2000)

రచన : ఆచార్య ఎస్.గంగప్ప

ప్రచురణ : శశీ ప్రచురణలు, గుంటూరు.

వెల: 120/- , పేజీలు : 154.

ప్రతులకు : శ్రీమతి ఎస్. పార్వతమ్మ

సుధర్మ, సి- 73, శ్రీనివాస నగర్ కాలనీ, గుంటూరు - 522006.

-పి.ఎం. సుందరరావు

సాహితీలోకాన్ని అలరించే ముచ్చట్లు

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో లబ్ధప్రతిష్ఠుడైన సినీ సంభాషణలకర్త, కవి; రచయిత; ప్రముఖులు త్రిపురనేని మహారథి. 75 సంవత్సరాల తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఇటీవల (2008) వజ్రోత్సవాలు జరుపుకొంది. చిత్రనిర్మాణ రంగంలో తొలి నాటి పెద్దలైన నాగిరెడ్డి, చక్రపాణి, డి.వి.ఎస్ రాజు లాంటి నిర్మాతలతో గూడవల్లి రామబ్రహ్మం; పి. పుల్లయ్య సి.ఎస్ రావు లాంటి దర్శకులతోను, మహారథి అనుభవాలు, పరిచయాలు "చిత్రప్రభ" పత్రికలో ధారావాహికంగా ఇటీవల కాలంలో ప్రచురణ పొందినవే... వాటిని వంద పేజీల్లో చక్కటి ఫొటోలతో అందంగా ఈ గ్రంథాన్ని మహారథి ముద్రించి పాఠకలోకానికి అందించారు. సాహిత్య కారులతో తన అనుబంధాన్ని ఆర్ద్రంగా రాశారు. 75 సంవత్సరాల సినీ నిర్మాణ రంగంలో అరవై ఏళ్ళ అనుభవం మహారథి గారిది. వారి మాటైనా అభిప్రాయమైనా రచన అయినా ఎంతో సాధికారికంగా వుంటుంది. రాజకీయాల్లో పని చేసిన ఆయన ఏ సందర్భంలోనైనా ముక్కు సూటిగా మాట్లాడటం చెప్పుతల్చుకున్న విషయాన్ని నిర్భయంగా చెప్పడం మహారథి నైజం, ఈ ముచ్చట్ల సంకలనంలోనూ ఆ లక్షణం స్పష్టంగా కన్పిస్తుంది.

తన గురించి తన కాలాన్ని గురించి రాసేవాడొక్కడే సర్వ ప్రజల్ని గురించి సర్వ కాలాల్ని గురించి రాసిన వాడుగా గుర్తింపు పొందుతాడంటాడు షెల్లీ... మహారథి ముచ్చట్లు ఆ దిశగా సాగాయి. ఆలోచింపజేస్తాయి. అల్లూరి సీతారామరాజు చిత్ర రచనలో తను చేసిన తపస్సును గురించి చెప్పడమేకాదు. తనలోని లోపాలను తప్పులను నిర్భయంగా వ్యక్తపర్చడం ఆయన నిజాయితీకి నిదర్శనం. ఈ లక్షణం ప్రతివ్యక్తికి అవసరం. అది ఆత్మ పరిశీలనకు స్వీయలోపాలు తెల్సు కోవడానికి తోడ్పడుతుంది. ప్రతి రచయిత, కవికి ఈ లక్షణం ఉండాలి. మల్లాది, సముద్రాల, శ్రీశ్రీ, ఆత్రేయ, ఆరుద్ర, జూనియర్ సముద్రాల, గోపిచంద్ లాంటి సాహిత్య వేత్తలతోపాటు, డా॥ గరికపాటి రాజారావు, సావిత్రి, కాంచనమాల... రాజబాబుల గురించి ఎంతో ఆర్ద్రంగా మహారథి రాశారు. తెలుగు నాటకరంగం నుండి సినిమా రంగంలోకి ఎందరో చేరారు. వారి గురించి రాశారు. ఈ గ్రంథంలో బళ్ళారిరాఘవ, బందా కనక లింగేశ్వరరావు (పేజి 14,15), స్థానం నరసింహారావు పేజి17), రెంటాల గోపాలకృష్ణ (పేజి27), శ్రీశ్రీ.. ఆర్థికనీతి (పేజి.71), ఎమ్.జి ఆర్ దానగుణం (పేజి 64), చెప్పేది చేసేది ఒకటి అవ్వాలా? (పేజి58), మాట తప్పిన మహారథి (పేజి.85), ఆర్ట్ ఆఫ్ లివింగ్ పరిణత (పేజి 97), చావును కోరిన ఆత్రేయ (పేజి 93), సింహాసనం, పాడిపంటలు, అల్లూరి సీతారామరాజు, దేవుడు చేసిన మనుషులు, కంచుకోట, బందిపోటు లాంటి హిట్ చిత్రాలకు రచయితగా శతకకవిగా ఆకాశవాణిలో (దక్కన్ రేడియో) ప్రోగ్రామర్‌గా బహుముఖ అక్షర తపస్వి మహారథి ముచ్చట్లు సినీ రచయితలకు... సాహిత్యవేత్తలకు "మార్గదర్శకం"గా ఉంటుంది.

మహారథి ముచ్చట్లు

త్రిపురనేని మహారథి

వెల : 60/-, పేజీలు : 99,

ప్రతులకు : విశాలాంధ్ర అన్ని బ్రాంచీల్లో, ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీల్లో. ఇతర బుక్ షాపుల్లో. నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్. నవయుగ, హైదరాబాద్.

- తంగిరాల చక్రవర్తి

హోటల్ లవణం



మంచు హోటల్ గురించి... ఇసుక హోటల్ గురించి విన్నాం కన్నాం. మరి ఉప్పు హోటల్ వుందని తెల్సా!
తెలీకపోతే మాత్రం బొలీవియా వెళ్లాల్సిందే. టూరిస్టులను ఆకర్షించడానికి అక్కడ పూర్తిగా ఉప్పుతో ఒక హోటల్‌నే కట్టేశారు. జనాలు మాత్రం ఎగబడి వస్తున్నార్ట!





ఐస్‌క్రీం కావాలని మారాం చేయని పిల్లలుంటారా చెప్పండి. అయితే ఈ పక్షికి కూడా ఐస్‌క్రీం చూస్తే చాలు నోరూరి పోతుంది. సర్రున వచ్చి లటక్కన ఐస్‌క్రీం నోటకరుచుకుని వెళ్లిపోయి చల్లగా చప్పరించేస్తుంది.



నాకూ ఐస్‌క్రీం కావాలి



కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలు!

మీకూ్కడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్ కలంస్నేహం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్.

పేరు: కె. బుజ్జి
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జడ్.పి.జి.హెచ్. ఎస్
లక్ష్యం: ఎడిటర్ కావడం
హాబీలు: టీవీ చూడటం, ఆటలు ఆడటం
చిరునామా: కె. బుజ్జి
డాటరాఫ్ :కె. జయరావు
తిరువూరు,
సీతామహాలక్ష్మి కాలనీ, కృష్ణా జిల్లా.

పేరు: రాజుపాలెం అజయ్ కాంత్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: సెయింట్ ఇగ్నేషియస్ స్కూల్
లక్ష్యం: శాస్త్రవేత్త కావడం
హాబీలు: పుస్తకాలు చదవటం
చిరునామా: రాజుపాలెం అజయ్ కాంత్
సన్నాఫ్ : ఆర్. కోటేశ్వరరావు
శ్రీరామానగర్ కాలనీ,
ప్రత్తిపాడు, గుంటూరు.

పేరు: బోడ నరేష్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: గ్రంథాలయానికి వెళ్లడం, ఆడటం
చిరునామా: బోడ నరేష్
సన్నాఫ్ : బోడ వెంకన్న
జాఫ్రాబాద్, బయ్యారం,
ఖమ్మం.

పేరు: కె. వినోద్ కుమార్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: సిద్ధార్థ హై స్కూల్
నచ్చిన నాయకుడు : భగత్ సింగ్
హాబీలు: చదవటం, ఆడటం
చిరునామా: కె. వినోద్ కుమార్
గోవింద్ పల్లి (గ్రామం),
ధర్పల్లి (మం),
నిజామాబాద్.

పేరు: షేక్ కాలేషా వలి
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
లక్ష్యం :సి.ఎ కావటం
హాబీలు: క్రికెట్, వాలీబాల్ ఆడటం
చిరునామా: షేక్ కాలేషా వలి
సన్నాఫ్ : హనీఫ్
చిన్నపట్ల పూడి,
నగరం (మం),
గుంటూరు జిల్లా.

పేరు: బి. కుమార స్వామి
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: ప్రగతి విద్యాలయం
లక్ష్యం: క్రికెటర్ కావడం
హాబీలు: చదవటం, క్రికెట్ ఆడటం
చిరునామా: బి. కుమార స్వామి
సన్నాఫ్ : కె. కొమరయ్య
తిగారం (గ్రా),
పాలమర్తి, వరంగల్.

పేరు: దోనపల్లి తిరుమలేష్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: ప్రభుత్వ ఉన్నత పాఠశాల
లక్ష్యం : లాయర్ కావడం
హాబీలు: డాన్స్ చేయడం, క్రికెట్ ఆడటం
చిరునామా: దోనపల్లి తిరుమలేష్
సన్నాఫ్ : డి. వెంకన్న
మేపిదపల్లి (గ్రా),
తిరుమలామపాలెం, ఖమ్మం.

పేరు: ఎస్. మహి కుమార్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: ప్రగతి విద్యాలయం
లక్ష్యం :క్రికెటర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవటం
చిరునామా: ఎస్. మహి కుమార్
సన్నాఫ్ : ఎస్. లాలయ్య
పాలపర్తి,
వరంగల్.